₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 04

ఫిబ్రవరి 16-28, 2019



## దేశ చరిత్రలో పీవీ స్థానం కీలకం, పదిలం !




# ఢిల్లీలో విడుదల



## ఎట్టకేలకు తెలుగునాట 'గ్రామ న్యాయాలయాలు'



## వలస పోనవసరం లేని ఊళ్లుగా తీర్చిదిద్దాలి



















# ఢిల్లీకి ఉత్తరాంధ్ర చర్చా వేదిక 'జనఘోష' రైలు యాత్ర

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయటంతోపాటు విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 'జనఘోష' పేరుతో ఢిల్లీకి రైలుయాత్ర చేశారు. ఢిల్లీలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని, వివిధ పార్టీల నేతలను కలిసి లోక్‌సత్తా/ ఎఫ్‌డీఆర్ చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం రూపొందించిన నివేదికను అందచేశారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు ప్రస్తుతం ఎలా ఉంది, నిధులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదంలో వాస్తవాలేమిటి, ఇంకా ఎన్ని నిధుల్ని ఇవ్వాలి, ఆర్థికభారం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎలా ఆ నిధుల్ని నిర్ణీత కాలవ్యవధిలో ఇవ్వొచ్చు... తదితర అంశాలన్నింటినీ ఆ నివేదికలో పొందుపరిచారని వివరించారు. రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీ సమాధి వద్ద మౌన దీక్షను నిర్వహించారు. లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పలువురు ఉత్తరాంధ్ర నేతలు, కళాకారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు జేపీతోపాటు ఇతర స్వతంత్ర, జాతీయ నిపుణులతో కలిసి ఢిల్లీలో నివేదిక విడుదల కార్యక్రమాన్ని కూడా ఉత్తరాంధ్ర చర్చా వేదిక నిర్వహించింది. ఆ చిత్రాలివి.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఫిబ్రవరి 16-28, 2019 సంపుటి - 10 సంచిక - 04

## లోపలి పేజీల్లో...

పాలనన చూసి ఓటేయమనే సాహసం ............ 5
'యూనియన్ బడ్జెట్ 2019-20' తాత్కాలిక..... 6
ఎట్టకేలకు తెలంగాణలో గ్రామన్యాయాలయాలు.. 11
గ్రామన్యాయాలయాలతో సామాన్యుడికి ...........13
ఫిబ్రవరి 28న తీన్‌మూర్తిభవన్‌లో ...................14
దేశ చరిత్రలో పి.వి. స్థానం కీలకం, పదిలం ! ...... 15
నవతరం నాయకులు మీరు - భావి (భవిష్యత్తు).... 16
'తెలంగాణలో పంచాయితీలు' ఇంకా సగానికి.....21
స్వతంత్ర నిపుణుల బృందం నివేదిక ఢిల్లీలో .........22
ఏపీకి 'ప్రత్యేక హోదా పన్ను రాయితీలు' ............ 24
ఫెడరలిజాన్ని విస్తరించేందుకు నిర్మాణాత్మక........ 27
(మీడియా) 'కీ' కామెంట్లు ! ............................ 28
రిజర్వు స్థలాలను అన్యాక్రాంతం చేసే ............... 29
లోక్‌సత్తా సహచరులారా ! (మనసులో మాట)...... 30
డబ్బు ఎన్నికలను ప్రత్యామ్నాయ రాజకీయ .......... 33
వైద్యుల పట్ల గౌరవం తగ్గటం ప్రజారోగ్యానికి........ 34

## కార్టూన్ కార్నర్



ఈ సారి ఎన్నికల్లో మేనిఫెస్టోతో
అవసరం ఉండదనుకుంటా!

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు


| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA



**త**మ ఐదేళ్ల పాలనను చూసి ఓటు వేయమనే సాహసం చేయలేక ఎన్నికల్లో గెలవటానికి చేసిన ఆపద మొక్కుల్లా యూనియన్ బడ్జెట్ ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

మంత్రి పీయుష్ గోయల్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2019పై జేపీ స్పందిస్తూ.. ఇది పూర్తిగా ఎన్నికల బడ్జెట్, ఎన్నికల ఉపన్యాసంలా ఉన్న బడ్జెట్ అని వ్యాఖ్యానించారు.

రైతులు, అసంఘటితరంగ కార్మికులు, మధ్యతరగతి ఉద్యోగులు అనే మూడు వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఉపశమన హామీల్ని ప్రకటించారని, అయితే మొట్టమొదటిసారిగా రాష్ట్రంతో సంబంధం లేకుండా యూనియన్ ప్రభుత్వం నేరుగా ప్రజలకు రాయితీల్ని ప్రత్యక్షంగా బదిలీ చేసే ధోరణి ఇందులో ప్రస్ఫుటంగా కనిపిస్తోందని జేపీ అన్నారు. చిన్న, సన్నకారు రైతులకు

# పాలనను చూసి ఓటేయమనే సాహసం లేని ప్రభుత్వపు ఆపద మొక్కుల ఎన్నికల బడ్జెట్: జేపీ

ఏడాదికిచ్చే రూ. 6,000ను నేరుగా యూనియన్ బ్యాంకు అకౌంట్లలోకి బదిలీ చేస్తామని చెబుతోందన్నారు. ఇప్పటిదాకా ఇలాంటి రాయితీలు, పింఛన్లు వంటి వాటిని రాష్ట్రాలతో కలిపి తన వంతు వాటాతో ఇవ్వటం ఆనవాయితీగా వస్తోందన్నారు. రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను, ముఖ్యమంత్రులను చూసి పంచాయతీ నుంచి పార్లమెంటు వరకూ ఓట్లు వేస్తున్న ప్రస్తుత తరుణంలో.. రాష్ట్రాలతో సంబంధం లేకుండా నేరుగా యూనియన్ ప్రభుత్వం ప్రజలకు బదలాయింపులు చేయటం ఎలాంటి మార్పులకు దారితీస్తుందో వేచి చూడాలన్నారు.


బడ్జెట్‌లో వడ్డీలు రూ. 6,65,000 కోట్లు, రాష్ట్రాలకు వివిధ రూపాల్లో ఇవ్వాల్సిన రూ. 13,70,000 కోట్లు పోగా మిగిలేది రూ. 7,30,000 కోట్లు మాత్రమేనని, ఇందులో 3,00,000 కోట్లు రక్షణ రంగానికి పోతాయని, పీఆర్‌సీల వంటి వాటికి ఇంకొంత ఖర్చు ఉంటుందని, మిగిలిన మొత్తంలో దివాళా తీసేరీతిలో కాకుండా, కొంత తెలివిగా, దేశాన్ని మరింత అప్పుల్లో ముంచకుండా పరిమితంగా తాత్కాలిక తాయిలాల్ని ప్రకటించటమొక్కటే గుడ్డిలో మెల్ల అని జేపీ అన్నారు.

తన పాలనా వైఫల్యాన్ని గుర్తించి, గతం నుంచి పాఠాలు నేర్చుకుని ఒక స్పష్టమైన పథకాన్ని, ప్రణాళికను ప్రకటించే ప్రయత్నాన్ని యూనియన్ ప్రభుత్వం చేయకపోవటం ఈ చివరి బడ్జెట్‌లో పెద్ద లోటని జేపీ అన్నారు. ఏ వైఫల్యాల వల్ల భారతదేశం వేగంగా ఎదగలేకపోతోందో, ఆ వైఫల్యాలను సరిదిద్దేమౌలిక మార్పుల కోసం బడ్జెట్‌లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. విద్య, ఆరోగ్యాలను బాగు చేయటం కోసం, ఉపాధి, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాల్లేని సేవలు అందించటం, స్థానిక స్వయంపాలన, చట్టబద్ధపాలన, వ్యవసాయం లాభసాటి చేయటం కోసం ఎటువంటి ప్రయత్నం చేయకుండా.. గత ప్రభుత్వాల తరహాలోనే తమ పాలన కూడా పాత విధానాలతో ఉంటుందని, ఎన్నికల సమయం వచ్చే సరికి తాయిలాలను మొహం మీద పడేస్తామని మోదీ ప్రభుత్వం బడ్జెట్ ద్వారా చెప్పినట్లుందన్నారు. పాలకుల విధానాల వల్ల కాకుండా కేవలం 130 కోట్ల జనాభా ఉండటం వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందని, ఇదికకూడా మంత్రి చెప్పినట్లు వచ్చే ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లకు, ఎనిమిదేళ్లలో 10 ట్రిలియన్ డాలర్లకు చేరటం అసాధ్యమన్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి గత కొన్ని నెలల్లోనే 20 శాతం మేర పతనమైందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిన మాట వాస్తవమనటంలో సందేహంలేదని, వాస్తవాల్ని, గణాంకాల్ని అణచిపెట్టేందుకు ప్రయత్నించినా ప్రజల జీవితాల్లో ఈ సంక్షోభం కనిపిస్తోందని అన్నారు. భారతదేశానికి ఆలస్యంగానైనా ఈవేళ కావలసింది మౌలిక మార్పులని, ఈ దిశగా ప్రయత్నాలు జరగనంత వరకూ ఇలాంటి బడ్జెట్‌ల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ✧

# 'యూనియన్ బడ్జెట్ 2019-20'.. తాత్కాలిక పద్దు - తాత్కాలిక తాయిలాలు


**2014** ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలకు భిన్నంగా, ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తన పాలనకు చెప్పుకున్న సంకల్పానికి విరుద్ధంగా నరేంద్ర మోదీ 2019 యూనియన్ తాత్కాలిక బడ్జెట్‌ను తాత్కాలిక తాయిలాల బడ్జెట్‌గా మార్చారు.

దేశంలోని సుమారు 12 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.75,000 కోట్ల లబ్ధి కలిగించేలా కొత్త పథకాన్ని మోదీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. సాగులో ఉన్న భూమి రెండు హెక్టార్ల కన్నా తక్కువగా ఉన్న రైతులకు ఏటా రూ.6,000 మూడు దఫాలుగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది (పీఎం-కిసాన్ పథకం). అసంఘటిత కార్మికులకూ నెలకు రూ.3,000 పింఛన్ ఇవ్వబోతున్నట్లు ప్రకటించింది (ప్రధాన్‌మంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్). మధ్యతరగతి వేతన జీవులకు రూ.5లక్షల వరకూ ఆదాయపు పన్ను రిబేటుకు రూ.18,500 కోట్ల మేర వెచ్చించనున్నట్లు తెలిపింది. చిన్న వ్యాపారులకు జీఎస్టీ ఊరట, ఇండ్ల కొనుగోలుదారులకు పన్ను రాయితీ.. ఇలా వరుసపెట్టి ప్రజాకర్షక పథకాలను ప్రతిపాదించారు.




**యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2019-20 సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)**

| | 2017-18 వాస్తవ గణాంకాలు | 2017-18 బడ్జెట్ అంచనాలు | 2017-18 సవరించిన అంచనాలు | 2017-18 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| **1) రెవెన్యూ వసూళ్లు** | 14,35,233 | 17,25,738 | 17,29,682 | 19,77,693 |
| ఎ) పన్ను ఆదాయం | 12,42,488 | 14,80,649 | 14,84,406 | 17,05,046 |
| బి) పన్నేతర ఆదాయం | 1,92,745 | 2,45,089 | 2,45,276 | 2,72,647 |
| **2) మూల ధన వసూళ్లు** | 7,06,742 | 7,16,475 | 7,27,553 | 8,06,507 |
| ఎ) రుణ వసూళ్లు | 15,633 | 12,199 | 13,155 | 12,508 |
| బి) ఇతర వసూళ్లు | 1,00,045 | 80,000 | 80,000 | 90,000 |
| సి) రుణాలు | 5,91,064 | 6,24,276 | 6,34,398 | 7,03,999 |
| **3) మొత్తం వసూళ్లు** | 21,41,975 | 24,42,213 | 24,57,235 | 27,84,200 |
| **4) మొత్తం వ్యయం** | 21,41,975 | 24,42,213 | 24,57,235 | 27,84,200 |
| **5) రెవెన్యూ లోటు** | 4,43,602 | 4,16,034 | 4,10,930 | 4,70,214 |
| **6) ద్రవ్య లోటు** | 5,91,064 | 6,24,276 | 6,34,398 | 7,03,999 |



**తాత్కాలిక బడ్జెట్‌లో రూపాయి రాక - పోక**

| రూపాయి రాక | రూపాయి పోక |
|---|---|
| రుణేతర మూల ధన రాబడి- 3 | రాయితీలు- 9 |
| పన్నేతర రాబడి- 8 | కేంద్ర రంగ పథకాలు- 12 |
| జీఎస్‌టి- 21 | రక్షణ- 8 |
| అప్పులు- 19 | కేంద్ర ప్రాయోజిత పథకాలు- 9 |
| కార్పొరేట్ పన్ను- 21 | పింఛన్లు- 5 |
| ఆదాయపు పన్ను- 17 | ఆర్థిక సంఘం, ఇతర బదిలీలు- 8 |
| కస్టమ్స్ సుంకాలు- 4 | వడ్డీ చెల్లింపులు- 18 |
| కేంద్ర ఎక్సయిజ్ సుంకాలు- 7 | పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటా- 23 |
| | ఇతర వ్యయం- 8 |

ఆర్థిక బాధ్యతల్ని తాత్కాలికంగా చేపట్టిన రైల్వే మంత్రి పీయుష్ గోయల్ లోక్‌సభలో రూ. 27.84 లక్షల కోట్ల వ్యయ అంచనాలతో 2019-20 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

తాత్కాలిక తాయిలాలను ప్రకటించే సమయంలో హిందీలో వివరిస్తూ దేశంలో అత్యధిక ఓటర్లకు తమ రాయితీల సందేశం చేరేలా మంత్రి ప్రయత్నించారు. హిందీలో దాదాపు 100 నిమిషాలకుపైగా గోయల్ ప్రసంగం సాగింది.

వ్యవసాయ సర్వే ప్రకారం దేశంలో రెండు హెక్టార్లు (ఐదెకరాలు) లోపు కమతాలున్న రైతులు 86.21 శాతం ఉన్నారని, దేశంలో జరుగుతున్న వ్యవసాయంలో వీరి వాటా 47.34 శాతంగా ఉందని మంత్రి చెప్పారు. చేపలు, పశువుల పెంపకం చేసేవారికి తోడు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతులకు 2 శాతం వడ్డీ రాయితీని కల్పించారు. సకాలంలో వడ్డీ చెల్లించే రైతులకు రుణాలపై 3 శాతం వడ్డీ సాయం అందిస్తామన్నారు. 2017-18 డేటా ప్రకారం రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న పన్ను చెల్లింపుదారులు 3,53,88,404 మంది ఉన్నారు. వీరందరికీ రిబేటు రూపంలో ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు లభించింది. పన్ను రిబేటుతోపాటు బ్యాంకుల్లో ఫిక్సడ్ డిపాజిట్లు, పోస్టాఫీసు డిపాజిట్లు, ఇతర వడ్డీ ఆదాయాలపై టీడీఎస్ మినహాయింపును రూ.10 వేల నుంచి 40 వేలకు పెంచడం ద్వారా స్థిరాదాయంపై ఆధారపడే సీనియర్ సిటిజన్లతోపాటు పొదుపు చేసే వేతన జీవులందరికీ ఉపశమనం కలిగించారు. నెలకు వంద రూపాయలతో 60 ఏళ్లు నిండిన తర్వాత నెలకు రూ.3,000 పింఛను అందేలా అసంఘటితరంగ కార్మికులకు కనీస ఆదాయభద్రత కల్పించారు. గృహనిర్మాణ రంగానికి ఊతమిచ్చేందుకు రెండో ఇంటి కొనుగోలు పన్ను ఎత్తివేశారు. అద్దె ఆదాయంపై టీడీఎస్ మినహాయింపును రూ.1.8 లక్షల నుంచి 2.4 లక్షలకు పెంచారు. స్థిరాస్థి అమ్మకం ద్వారా వచ్చిన రూ.2 కోట్ల వరకు సొమ్ముతో ఏడాదిలోగా రెండు నివాస గృహాలను కొనుగోలు చేస్తే క్యాపిటల్‌గెయిన్ ట్యాక్స్ నుంచి మినహాయించారు. గతంలో ఇది ఒక ఇంటికే పరిమితంగా ఉంది. ఆదాయం పన్ను ప్రతిపాదనలను పూర్తిస్థాయి బడ్జెట్‌లో ప్రతిపాదించటం ఆనవాయితీ అయినప్పటికీ, మధ్యతరగతి ఉద్యోగులు, పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లు వారి పన్ను చెల్లింపుల్లో స్పష్టత కావాలని కోరుకుంటున్నందునే పన్ను రాయితీ ప్రతిపాదనలు చేసినట్లు మంత్రి గోయల్ వివరణ ఇచ్చారు.

రాయితీల కారణంగా గత ఏడాది నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యాలను పెంచుకోవాల్సి వచ్చింది. గత బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న జీడీపీలో 3.1 శాతం ద్రవ్యలోటును 3.4 శాతానికి పెంచుకోవాల్సి వచ్చింది. రక్షణ బడ్జెట్‌ను 7 శాతం పెంచుతూ తొలిసారిగా రూ.3,00,000 కోట్లకు ప్రతి పాదించారు. సబ్సిడీల బిల్లు రూ.2.66 లక్షల కోట్ల నుంచి 2.97 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా నిధుల సమీకరణ లక్ష్యాన్ని రూ.80,000 నుంచి 90,000 కోట్లకు పెంచారు. అయితే.. గతేడాది లక్ష్యాన్ని ఇప్పటివరకూ చేరుకోకపోవటం గమనార్హం. రిజర్వ్‌బ్యాంకు, ఇతర బ్యాంకుల నుంచి రూ.82,900 కోట్ల డివిడెండ్‌ను ఆశిస్తున్నట్లు చెప్పారు.

వెనుకబడిన వర్గాలు, దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేసే సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వ శాఖకు ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు మాత్రం పెంచి, రూ.7,800 కోట్లు కేటాయించారు. దివ్యాంగుల సాధికారత కోసం గత బడ్జెట్‌లో రూ.1,070 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.1,144.90 కోట్లు కేటాయించారు. ఎస్.సి, బీసీ, ఈబీసీలకు నేషనల్

## ఏపీ, తెలంగాణకు పన్నుల్లో వాటా పెరుగుదల

కేంద్ర పన్నుల నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు వాటాలు పెరిగాయి. ఏపీకి 2018-19 కన్నా 10 శాతం (రూ.3,573.23 కోట్లు) అధికంగా రూ.36,360.26 కోట్లు రానున్నాయి. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం రాష్ట్రానికి యూనియన్ పన్నుల్లో 4.305 శాతం వాటాను పంచుతోంది. కార్పొరేట్ ట్యాక్స్ రూపంలో అత్యధిక వాటా దక్కుతోంది. ఆ తర్వాత స్థానంలో సీజీఎస్‌టీ, ఆదాయపన్నులు ఉన్నాయి. తెలంగాణకు యూనియన్ పన్నుల వాటా గతేడాది కంటే రూ.2,022.17 కోట్లు పెరిగింది. తాజా బడ్జెట్ ప్రకారం రాష్ట్రానికి రూ.20,583.05 కోట్లు లభించాయి. పన్నుల వాటాగా మహారాష్ట్రకు రూ.46,630.66 కోట్లు, కర్ణాటకకు రూ.39,806.26 కోట్లు, తమిళనాడుకు రూ.33,978.47 కోట్లు, ఉత్తర ప్రదేశ్‌కు రూ.1,51,682.70 కోట్లు, బీహార్‌కు రూ.81,631.13 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.63,750.81 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.61,858.90 కోట్లు లభించాయి.

ఫెలోషిప్ కింద ఇచ్చే కేంద్ర స్కాలర్‌షిప్‌లు, ఎస్.సిలు, ఓబీసీలకిచ్చే ప్రవాస భారతీయ స్కాలర్‌షిప్‌ల నిధులకు భారీగా కోత విధించారు. వీటి కోసం గత బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో దానిని రూ.390.50 కోట్లకు ప్రభుత్వం తగ్గించింది. ఎస్.సి, బీసీ, సఫాయి కర్మచారీలతోపాటు మొత్తం ఐదు జాతీయ కమిషన్లకు రూ.39.87 కోట్లు కేటాయించారు.

గో సంపద వృద్ధికి రూ.750 కోట్లతో రాష్ట్రీయ కామధేను ఆయోగ్‌ను ప్రకటించారు.

విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న వనరుల లోటు భర్తీ సహా ఏ అంశాన్నీ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ ప్రభుత్వం కొన్ని పథకాలు, ప్రాజెక్టుల పరంగా అడిగిన సాయాన్ని కూడా దాటవేశారు.

రాబోయే ఐదేళ్లలో లక్ష గ్రామాలు డిజిటల్ గ్రామాలుగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ అభివృద్ధికి చర్యల్ని ప్రకటించారు.

రాబోయే ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి (రూ.360 లక్షల కోట్లు), ఆ తర్వాత మూడేళ్లలో 10 ట్రిలియన్ డాలర్లకి (రూ.720 లక్షల కోట్లు) మన ఆర్థిక రంగం ఎదుగుతుందని మంత్రి చెప్పారు. రాబోయే దశాబ్దికి దార్శనికతను విజన్-2030 పేరుతో నూతన బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనికోసం 10 ముఖ్యమైన దృక్కోణాలను ఆవిష్కరించింది.

■ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఖజానాకు వచ్చే ప్రతి రూపాయిలో 70 పైసలు

## రైల్వేలకు రూ. 64,587 కోట్లు

బడ్జెట్‌లో రైల్వేలకు రూ.64,587 కోట్లు ప్రతిపాదించారు. రైల్వే మూలధన వ్యయానికి రూ.1.58 లక్షల కోట్లను కేటాయించారు. రైలు ఛార్జీల పెంపు జోలికి పోలేదు. 2018-19 సంవత్సరం రైల్వే చరిత్రలోనే అత్యంత భద్రమైనదిగా నిలిచిందని పీయూష్ గోయల్ తన ప్రసంగంలో అభివర్ణించారు. దేశంలో కాపలాలేని బ్రాడ్‌గేజ్ రైల్వే క్రాసింగ్‌లు అంటూ ఉండవు, అన్ని చోట్లా కాపలా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 96.2గా ఉన్న రైల్వే ఆపరేటింగ్ నిష్పత్తిని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి 95 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు. 2014తో పోలిస్తే ప్రణాళికావ్యయం 148 శాతం పెరగనుంది. కొత్త లైన్ల నిర్మాణానికి రూ.7,255 కోట్లు, గేజ్‌ల మార్పిడికి రూ.2,200 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ.700 కోట్లు, సిగ్నలింగ్‌కు రూ.1750 కోట్లు కేటాయించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన సెమీ హైస్పీడ్ ట్రెయిన్ 'వందేభారత్ ఎక్స్‌ప్రెస్' వేగంలో ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభూతినిస్తుందని మంత్రి చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సహా పలుచోట్ల కొత్త లైన్లు, రైళ్ల జోలికి వెళ్లకుండా పాత ప్రాజెక్టులను పూర్తి చేయటానికే రైల్వే శాఖ ప్రాధాన్యతనిచ్చింది. సౌకర్యాల కల్పనకు కేటాయింపుల్ని పెంచింది.

ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుంచే లభించనున్నాయి. అదే సమయంలో ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయిలో 23 పైసలు పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటాగా ఉంది. దీని తర్వాత రెండోస్థానంలో 18 పైసలు వడ్డీ చెల్లింపుల రూపంలో కోశాగారం నుంచి తరలిపోనున్నాయి. ఒక్క జీఎస్‌టీ నుంచే ప్రతి రూపాయిలో 21 పైసల ఆదాయం లభించనుంది.

■ గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించింది. గతసారితో పోలిస్తే 2019-20లో 17 శాతం మేర నిధులు పెరిగాయి. ఈ శాఖకు ప్రభుత్వం మొత్తం రూ.48,000 కోట్లు కేటాయించింది. ఇందులో ప్రధానమంత్రి పట్టణ ఆవాస్ యోజనకు రూ.6,853.26 కోట్లు, అమృత్ పథకానికి రూ.7,300 కోట్లు, ఆకర్షణీయ నగరాలకు రూ.6,600 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్‌కు రూ.2,750 కోట్లు కేటాయించారు.

■ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు యూనియన్ ప్రభుత్వం ఈ

బడ్జెట్‌లో రూ.29వేల కోట్లను కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ దఫా కేటాయింపులను 20 శాతం పెంచింది. ప్రసూతి కార్యక్రమాలకు రెట్టింపు కేటాయింపులను చేసింది.

■ నల్లధనం నిరోధక చర్యల ప్రభావంతో గత నాలుగున్నరేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా బయటపడని రూ.1,30,000 కోట్ల ఆదాయాన్ని పన్ను పరిధిలోకి తేగలిగామని పీయుష్ గోయల్ ప్రకటించారు. రూ.6,900 కోట్ల బినామీ ఆస్తులు, 1,600 కోట్ల విదేశీ ఆస్తులు స్వాధీనం చేసుకున్నామని, 3,38,000 డొల్ల కంపెనీల ఆనుపానులు కనిపెట్టి వాటి గుర్తింపు రద్దుచేశామని చెప్పారు.

■ కాలుష్య నియంత్రణకు బడ్జెట్‌లో 50 శాతం కోత పడింది. నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల రంగానికి ఎలాంటి కేటాయింపులు జరపలేదు.

■ పర్యావరణ మంత్రిత్వ శాఖకు నిధులు ఈ ఏడాది 20.27 శాతం పెరిగాయి. ఈ శాఖకు రూ.3,111.20 కోట్లు కేటాయించారు.

■ ఎస్.సి, ఎస్.టిల సంక్షేమానికి నిధుల్ని గతేడాది కంటే గణనీయంగా పెంచారు. ఎస్.సిలకు 2018-19 కంటే 35.6 శాతం అధికంగా ఈసారి నిధులను రూ.76,801 కోట్లకు పెంచారు. ఎస్.టిల సంక్షేమానికి సైతం నిధులను 28 శాతం పెంచి రూ.50,086 కోట్లను ప్రకటించారు.

■ ఆరోగ్యరంగానికి రూ.61,398 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో రూ.6,400 కోట్లను ప్రతిష్ఠాత్మక 'ఆయుష్మాన్ భారత్ - ప్రధాన్‌మంత్రి జన్‌ఆరోగ్య యోజన'కు ప్రత్యేకించారు. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్యసేవల కోసం ఆయుష్మాన్ భారత్ కింది వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రూ.250 కోట్లు ఇచ్చారు. జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ కింద వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు రూ.1,350.01 కోట్లు కేటాయించారు. కీలకమైన ఆరోగ్యరంగానికి ఈ రకమైన విదిలింపుల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

■ కేంద్ర హోం శాఖకు బడ్జెట్ కేటాయింపులు తొలిసారిగా లక్ష కోట్ల మార్కును దాటాయి.

■ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్రం రూ.60,000 కోట్లు కేటాయించింది. గతేడాది కంటే ఇది 11 శాతం ఎక్కువ.

■ ప్రధాన్‌మంత్రి గ్రామ్ సడక్ యోజన పథకంలో మార్పు లేదు. రూ.19,000 కోట్లు కేటాయించారు.

■ లోక్‌సభ ఎన్నికల కోసం రూ.వెయ్యి కోట్లు, ఖర్చుల కోసం రూ.339.54 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించారు.

■ దేశంలోని మెట్రో రైల్ ప్రాజెక్టులన్నింటికీ కలిపి రూ.19,152 కోట్లు ఇస్తున్నట్లు ప్రస్తావించారు. ఇందులో విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైళ్లతోపాటు ఢిల్లీ,

### 10 అంశాలతో దార్శనిక పత్రం 2030

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశం వచ్చే అయిదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్లకస్థాయికి చేరుకోనుందని మంత్రి పీయుష్ గోయల్ చెప్పారు. అయితే, మన దేశానికి ఇంతకుమించిన శక్తిసామర్థ్యాలు ఉన్నాయని, వచ్చే దశాబ్దానికి (2030) 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవాలని ఆంకాక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం పది కీలకాంశాలతో కూడిన దశ దిశల దార్శనిక పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. తన బడ్జెట్ ప్రసంగంలో చదివి వినిపించారు.

1. ప్రజల జీవన ప్రమాణాలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు, 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను రూపొందించేందుకు అవసరమైన భౌతిక, సామాజిక మౌలిక వసతుల కల్పన ఈ దార్శనిక పత్రంలోని తొలి అంశం. అత్యాధునికమైన రహదారులు, రైల్వేమార్గాలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, పట్టణ రవాణా వ్యవస్థలు, సహజవాయువు, విద్యుత్తు సరఫరాలు, అంతర్గత జలమార్గాల ఏర్పాటు వంటివి దీనిలో భాగం. ఇక సామాజిక మౌలిక వసతులు.. ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, స్వచ్ఛమైన పరిసరాలను కలిగి ఉండేలా ఉంటాయి. అత్యున్నతమైన విద్యాసంస్థల ద్వారా ఉన్నతమైన నాయకత్వాన్ని అందించేలా నాణ్యమైన, విజ్ఞాన ఆధారిత విద్యావ్యవస్థను రూపొందిస్తాం.

2. దేశంలోని మారుమూలలకూ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగానికీ చేరుకొనేలా, ప్రతి పౌరుడి జీవితాన్ని ప్రభావితం చేసేలా డిజిటల్ ఇండియాను తీర్చిదిద్దటం. ఇటీవలి సంవత్సరాలలో ప్రైవేటు, ప్రభుత్వ లావాదేవీలు డిజిటలీకరణ చేయటంతో సాధించిన విజయాల ఆధారంగా 2030 నాటికి డిజిటల్ ఆర్థిక వ్యవస్థను, డిజిటల్ మౌలిక వసతులను నిర్మిస్తాం. మన యువత ప్రారంభిస్తున్న అసంఖ్యాక అంకుర సంస్థలు, వారు సృష్టిస్తున్న లక్షల ఉద్యోగాలు మనల్ని ఈ గమ్యం దిశగా నడిపిస్తాయి.

3. భూమాతను సతత హరితంగా మలచుకోవటం, భారత్‌ను కాలుష్యరహిత దేశంగా తీర్చిదిద్దుకోవటం. విద్యుత్తు వాహనాలు, పునరుత్పాదక ఇంధనాల భారీ వినియోగం. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, ప్రజలకు ఇంధన భద్రత

కల్పిస్తూ.. విద్యుత్తు నిల్వ ఉపకరణాలు, విద్యుత్తు వాహనాల వినియోగంలో విప్లవాత్మక విధానాలను అందిపుచ్చుకోవటంలో ప్రపంచానికి మన దేశం మార్గనిర్దేశం చేస్తుంది.

4. ఆధునిక డిజిటల్ సాంకేతికతల దన్నుతో గ్రామీణ పారిశ్రామికీకరణను విస్తరింపజేస్తూ పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించటం. మేకిన్ ఇండియా చూపిన మార్గంలో దేశంలోని మారుమూల ప్రాంతాల్లోనూ అంకుర సంస్థలను ప్రోత్సహించటం, మధ్య, చిన్నతరహా పరిశ్రమలను స్థాపించటం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకుంటాం.

5. నదులు, జలాశయాలే మన జీవనాధారం. గంగా నది శుద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. 2030 కల్లా పరిశుద్ధమైన నదులు, దేశ ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావటం, సాగు రంగంలో సమర్థ నీటి యాజమాన్య పద్ధతులు అనుసరించేలా చేయటం.

6. సుదీర్ఘమైన సముద్రతీరం దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది. తీర ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సముద్ర సంపదను మనం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. సాగరమాల కార్యక్రమాన్ని వేగవంతం చేయటంతోపాటు ఇతర జలమార్గాలనూ సత్వరమే అభివృద్ధి చేసుకోవటం.

7. మన అంతరిక్ష కార్యక్రమాన్ని మరింత విస్తరించుకోవటం. ఉపగ్రహాల ప్రయోగాలకు మన దేశం ప్రపంచ దేశాలకూ వేదికగా మారింది. ఇదే క్రమంలో 2022 నాటికి మన దేశ వ్యోమగామిని అంతరిక్షంలోకి పంపించటం.

8. సేంద్రియ విధానాల్లో ఆహారోత్పత్తిని పెంచటం, ఈ రంగంలో స్వయంసమృద్ధిని సాధించటం. ప్రపంచ దేశాల ప్రజల అవసరాలు తీర్చేలా ఆహారోత్పత్తులను ఎగుమతి చేయటం. వ్యవసాయంలో అత్యాధునిక విధానాలు అనుసరించటం, అధికోత్పత్తిని సాధించటం, అదనపు విలువలు జోడించటం.. దీనిలో భాగంగానే ఆహారశుద్ధి, నిల్వ, ప్యాకింగ్, గొలుసుకట్టు విధానంలో శీతల గోదాముల నిర్మాణం తదితరాలపై దృష్టి సారించటం.

9. ఆరోగ్య భారత్ నిర్మాణంలో భాగంగా ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించటం. దీనికి అవసరమైన మౌలిక వసతులు సమకూర్చటం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. 2030 కల్లా ఆరోగ్య సంరక్షణకు సమగ్ర వ్యవస్థలను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావటం, మహిళలకు సాధికారత, సమాన హక్కులు, పూర్తిస్థాయి భద్రత కల్పించటంతోపాటు వారిని సంపూర్ణ భాగస్వాములను చేయటం ద్వారా ఆరోగ్యకరమైన దేశ నిర్మాణం.

10. 'కనిష్ట ప్రభుత్వం.. గరిష్ఠ పాలన' అందించేలా దేశాన్ని మలచుకోవటానికి ప్రజాప్రభుత్వాలతో కలసికట్టుగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. అందరి కృషితోనే లక్ష్యాలను సాధించుకోగలం. 2030 కల్లా ప్రజల పట్ల స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంతో స్పందించే అధికార యంత్రాంగాన్ని దేశం కలిగి ఉండాలి.

కాగా, ఈ విజన్ పేలవంగా ఉందని, దేశంలో మానవ వనరుల అభివృద్ధికి దోహదం చేసే మౌలిక చర్యలు ఇందులో లేవని సామాజిక రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు.

బెంగళూరు, చెన్నై తదితర ప్రాజెక్టులన్నీ చేర్చారు. వేటికెంతో చెప్పలేదు.

■ హైదరాబాద్‌లోని ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ. 319.39 కోట్లు కేటాయించారు.

■ కేంద్ర బడ్జెట్‌లో జాతీయ విద్యాసంస్థల నిధులను ప్రత్యేకంగా చూపకుండా హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ ఏజెన్సీ (హెఫా) ద్వారా ఇస్తున్నట్లు సూచించారు. ఇందులో ఏపీలోని విభజన చట్టం ప్రకారం పూర్తి చేయాల్సిన తిరుపతి ఐఐటీ వంటి వాటికి ఏమేరకు నిధులిస్తారో స్పష్టత లేదు.

■ అంతరిక్ష విభాగానికి రూ. 338 మేర బడ్జెట్‌ను పెంచగా, అణుశక్తి విభాగానికి రూ. 240 కోట్ల మేర తగ్గించి రూ. 16,725 కోట్లు కేటాయించారు.

■ ఆహార సబ్సిడీ కింద 2013-14లో రూ. 92,000 కోట్లు ఇవ్వగా, ఇప్పుడు దాదాపు రెట్టింపుగా రూ. 1,70,000 ఇస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

■ విద్యారంగానికి బడ్జెట్‌లో రూ. 93,847.64 కోట్లు కేటాయించారు. ఇందులో పాఠశాల విద్యకు రూ. 56,386.63 కోట్లు.

■ దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీలు, ఐఐఎంలు, ఐసర్‌లు, చట్టబద్ధ సంస్థలయిన యూజీసీ, ఏఐసీటీఈలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపుల్ని తగ్గించారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలవారికి రిజర్వేషన్లు కల్పిస్తున్న నేపథ్యంలో అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పెంచనున్నారు. ఈ పరిస్థితుల్లో కేటాయింపుల తగ్గింపు గమనార్హం. ✧

# ఎట్టకేలకు తెలంగాణలో గ్రామన్యాయాలయాలు

**లోక్‌సత్తా కృషితో 2008లో వచ్చిన చట్టం.. 'స్థానిక కోర్టులు'గా పట్టణాల్లోనూ అమలుచేస్తే మహిళల భద్రతకు భరోసా**

'జనం కోసం జేపీ' సురాజ్య యాత్రలోని 6 లక్ష్యాలలో చట్టబద్ధపాలన-మహిళా రక్షణకు 'స్థానిక కోర్టుల ఏర్పాటు' ఒకటి. దీనివల్ల చిన్న కేసులకు కొన్ని వారాలలో తీర్పులు వెలువడి, సామాన్యులకు వెంటనే చౌకగా న్యాయం అందుతుంది, పెద్దనేరాలు జరగకముందే నివారించే సంస్కృతి పెరుగుతుంది. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, తీవ్ర నేరాలు జరగకుండా ఈవ్‌టీజింగ్ స్థాయిలోనే అడ్డుకట్ట వేసే అవకాశముంటుంది. ఈ స్థానిక కోర్టుల ఏర్పాటుకు లోక్‌సత్తా కృషి వల్లే 2008లో వచ్చిన 'గ్రామ న్యాయాలయాల' చట్టమే మూలం (2003లో గ్రామ న్యాయాలయాల చట్టం ముసాయిదాను జేపీ రూపొందించి భారత ప్రభుత్వం ముందుంచారు. 2005లో ఇది కేబినెట్ ఆమోదం పొంది, ఆ తర్వాత మూడేళ్లకు పార్లమెంటు ఆమోదం పొందింది. 2009 అక్టోబర్ 2 నుంచి అమల్లోకి వచ్చింది). ఈ చట్టం వచ్చి దాదాపు పదేళ్లవుతున్నా ఇప్పటి దాకా తెలుగు రాష్ట్రాల్లో ఒక్క స్థానిక కోర్టును కూడా ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జేపీ అసెంబ్లీలో అడిగారు, ఇద్దరు ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. మౌలిక సదుపాయాల ఖర్చును కేంద్రం భరిస్తున్నా, మహిళలపై నేరాలు తగ్గించటానికి, సామాన్యులకు సత్వర న్యాయం అందించటానికి అవకాశమున్నా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక కోర్టుల ఏర్పాటును పట్టించుకోవటం లేదు. 'గ్రామ న్యాయాలయాల చట్టం-2008' సెక్షన్ 31 ప్రకారం గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వనస్థలిపురం నివాసి నరేంద్రగౌడ్ ఇటీవల హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ వ్యాజ్యంలో వైఖరిని తెలియజేస్తూ ప్రమాణపత్రం ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించింది. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 55 గ్రామన్యాయాలయాలను ఏర్పాటు చేయాలని సూచించింది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా 55 గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. దీనికి సంబంధించి ఫిబ్రవరి 1న జారీ చేసిన ఉత్తర్వులనూ జారీ చేసింది.


అంటే, గ్రామన్యాయాలయాల చట్టం.. వచ్చిన దాదాపు పదేళ్ల తర్వాత (బిల్లు తొలి డ్రాఫ్ట్‌ను లోక్‌సత్తా తయారుచేసిన 16 ఏళ్ల తర్వాత) తెలంగాణలో అమలుకు నోచుకుంటోంది.

గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసే గ్రామన్యాయస్థానానికి భవనం, కార్యాలయం, ఫర్నీచర్, కంప్యూటర్ తదితర వసతులకు కేంద్ర ప్రభుత్వమే ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. ఒకసారి రూ.18 లక్షలు, నిర్వహణ నిమిత్తం ఏడాదికి రూ.3.25 లక్షలు చొప్పున మూడేళ్ల పాటు మంజూరు చేస్తుంది. గ్రామన్యాయాలయాలు.. న్యాయాధికారి (మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ర్యాంకు) ఆధ్వర్యంలో నడుస్తాయి. పల్లెల్లో జరిగే సివిల్, క్రిమినల్ కేసులతో పాటు సివిల్ వివాదాలను విచారించవచ్చు. రూ.20 వేల లోపు దొంగతనం, రికవరీ కేసులు, భార్య, పిల్లల భరణం కేసులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే నేరాలు, కనీస వేతనాల చట్టం, వెట్టిచాకిరి, పౌరహక్కులు, శాంతిభద్రతలు, గృహహింస, ఆస్తి తగాదాలు, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాలు గ్రామస్థాయిలో అమలు, కాలువ గట్టు, నీటి పంపిణీ, పొలం సరిహద్దు వివాదాలను విచారించవచ్చు. మొబైల్ కోర్టు నిర్వహణ, అక్కడే సాక్షుల విచారణ, రాజీకి ప్రాధాన్యం, తీర్పుపై ఒకే అప్పీలు, ఆరు నెలల్లో పరిష్కారం.. వంటివి గ్రామన్యాయాలయాల ప్రత్యేకత. వీటికి న్యాయాధికారిని హైకోర్టు సలహాతో ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. గ్రామ న్యాయాధికారికి సహకారం అందించటానికి నలుగురు సిబ్బంది ఉంటారు. న్యాయాధికారి మినహా మిగతావారిని ఒప్పంద ప్రాతిపదికన నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఒక్కో గ్రామ న్యాయాలయానికి వేతన నిమిత్తం రూ.18 లక్షల చొప్పున రూ.9.90 కోట్లు, మౌలిక వసతుల కల్పన కింద రూ.5 లక్షల చొప్పున రూ.2.75 కోట్లు కేటాయిస్తున్నట్లు

### తెలంగాణలో గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేసే పంచాయతీలివే

1. ఆదిలాబాద్ : ముథోల్ బాసర, నస్పూర్, శ్రీరాంపూర్, మందమర్రి, ఆర్.కె పురం పి.ఎస్
2. కరీంనగర్ : చిగురుమామిడి, కోహెడ, బెజ్జంకి, మల్యాల, ధర్మపురి, పెగడపల్లి, కోల్లపల్లి, సారంగాపూర్, రాయికల్, కేశవపట్నం, సైదాపూర్, ఎల్కతుర్తి, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్
3. ఖమ్మం : వి.ఎం బంజారా, అశ్వారావుపేట, దమ్మపేట, బోనకల్, వైరా, తల్లాడ
4. మెదక్ : పటాన్‌చెరు
5. మహబూబ్‌నగర్ : ఆమనగల్లు, కొత్తూరు, కొందుర్గు
6. నల్గొండ : మునగాల, వేములపల్లి, త్రిపురారం, నడమనూరు, అల్వాల్ (హాలియా), పెద్దవూర, దామరచెర్ల, చింతపల్లి, చిట్యాల, వలిగొండ, చౌటుప్పల్, మోత్కూరు, బీబీ నగర్, యాదగిరిగుట్ట, బమ్మలరామారం
7. రంగారెడ్డి : శామీర్‌పేట, కుత్బుల్లాపూర్, పేట్‌బషీరాబాద్, కీసర
8. వరంగల్ : భూపాల్‌పల్లి, గీసుకొండ, వర్ధన్నపేట, పర్వతగిరి, సంగం, కె.సముద్రం




తెలిపింది. పాత జిల్లాల ప్రకారం ఆదిలాబాద్‌లో 5, కరీంనగర్‌లో 15, ఖమ్మంలో 6, మెదక్‌లో 1, మహబూబ్ నగర్‌లో 3, నల్గొండలో 15, రంగారెడ్డిలో 4, వరంగల్‌లో 6 న్యాయాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

అలాగే అమరావతిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా అవనిగడ్డకు చెందిన బిక్షం అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ, గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేయాల్సిందే నని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. 82 గ్రామన్యాయాలకు ఏపీ ప్రభుత్వం సంసిద్ధతను తెలిపి వివరాల్నిచ్చింది.

వాస్తవానికి లోక్‌సత్తా రూపొందించిన బిల్లు గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా అన్ని ప్రాంతాలకూ వర్తించే స్థానిక కోర్టుల ఏర్పాటుకు ఉద్దేశించినది. అయితే గ్రామాల వరకు ఏర్పాటుకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయటంతో ముందుగా గ్రామ న్యాయాలయాలకు బిల్లును పరిమితం చేశారు. గ్రామన్యాయాలయాల చట్టంలో స్వల్ప మార్పులు చేసి స్థానిక కోర్టులుగా పట్టణ ప్రాంతాలకు కూడా వర్తింపచేయాలని, ప్రతి లక్ష జనాభాకూ ఒక కోర్టును ఏర్పాటు చేయాలని, దీనివల్ల ప్రజాస్వామ్యానికి మూలమైన న్యాయం సామాన్యులకు త్వరగా అందుబాటులోకి రావటంతోపాటు, మహిళల రక్షణ కూడా మెరుగుపడుతుందని లోక్‌సత్తా పేర్కొంటోంది. ఈ రకంగా దేశవ్యాప్తంగా సుమారు 5,000 స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలని కోరుతోంది. ప్రస్తుతం 11 రాష్ట్రాల్లో 343 గ్రామ న్యాయాలను నోటిఫై చేయగా 9 రాష్ట్రాల్లో 210 మాత్రమే పనిచేస్తున్నాయి. దేశంలో మొట్టమొదటిసారిగా మధ్యప్రదేశ్ 2009లోనే వీటిని ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. కేరళలో 2012 నుంచి ఇవి అమలవుతున్నాయి. వారంలో రెండు రోజుల పాటు న్యాయాధికారులు గ్రామాల్లోనే ఉండి కేసులను పరిష్కరిస్తున్నారు. తీర్పులు కూడా మలయాళంలోనే ఇస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో చాలా వెనుకబడి ఉన్నాయి. దీనిపట్ల పాలకుల్లో, రాజకీయ పార్టీల్లో పెద్ద వ్యతిరేకత లేకున్నా.. ఇది ఓట్లు తెచ్చే సంచలన అంశంగా కనిపించకపోవటం, సంస్కరణాభిలాష లేకపోవటం, తమ డిమాండ్ పడి పోతుందేమోన్న భావన హైకోర్టు న్యాయవాదుల్లో కూడా కొంత ఉండటం వంటి కారణాల వల్ల ప్రజలకు ఎంతో మేలు చేసేదైనా, న్యాయ పట్టభద్రులకు యువతకు ఉపాధి కల్పించేదైనా ఈ చట్టాన్ని అమలు చేయటానికి నేతలు చొరవ చూపలేదు. ✧

*(రాజ్యసభలో గ్రామన్యాయాలయాల బిల్లు ఆమోదం సందర్భంగా డిసెంబర్ 18, 2008న హైదరాబాద్‌లో జేపీ నిర్వహించిన మీడియా సమావేశం నోట్ ఇది)..*

# గ్రామన్యాయాలయాలతో సామాన్యుడికి న్యాయం

## లోక్‌సత్తా ఏళ్ల తరబడి కృషికి ఫలితమన్న జేపీ... బిల్లు ఆమోదం పట్ల హర్షం

ప్రజల వద్దకే న్యాయాధికారులు వెళ్లి, కేసులలో ఆధారాల సేకరణ, విచారణ, తీర్పును అక్కడికక్కడే ఇచ్చే చరిత్రాత్మక గ్రామన్యాయలయాల బిల్లు, 2008 ఎట్టకేలకు రాజ్యసభ ఆమోదం పొందటం పట్ల లోక్‌సత్తా పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఇది త్వరలో పార్లమెంటు దిగువసభలో కూడా ఏకగ్రీవ ఆమోదాన్ని పొంది ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నట్టు పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. సామాన్యులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించే గ్రామన్యాయాలయాల ఏర్పాటు కోసం 12ఏళ్ల క్రితం లోక్‌సత్తా ఉద్యమం మొదలుపెట్టిననాటి నుంచి కృషి చేస్తున్నామని, 2003లో స్థానిక కోర్టుల బిల్లును రూపొందించి జాతీయ సలహామండలి ద్వారా 2005లో కేంద్ర కేబినెట్ ఆమోదానికి పంపామని తెలిపారు. రెండేళ్లకు కేబినెట్ ఆమోదం పొందిన బిల్లు, ఇప్పుడు రాజ్యసభ ఆమోదం పొందిందన్నారు. సామాజికాభివృద్ధి వేగంగా జరుగుతూ, ప్రతి ఒక్కరూ సంపదసృష్టిలో భాగస్వాములు కావాలంటే ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం అవసరమన్నారు. పేదలకు త్వరితగతిన, అందుబాటులో న్యాయం అందినప్పుడే వారు ఈ ప్రక్రియలో భాగస్వాములు కాగలుగుతారన్నారు. బ్రిటన్‌లో దారుణహత్యకు గురైన వెంపల సామ్రాజ్య జ్యోతిర్మయి హంతకుడికి కేవలం ఏడునెలల వ్యవధిలో కఠినశిక్షను అక్కడి కోర్టు ఖరారుచేసిందని, అదే ఇక్కడ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసుకే ఏడేళ్లు పట్టిందన్నారు. గ్రామన్యాయాలయాల ఏర్పాటుతోనే ఈ పరిస్థితిని మార్చి, ప్రజల్ని రాజ్యాంగబద్ధ పౌరులుగా చేయగలమన్నారు. అందుకే ప్రతి పౌరునికీ సత్వరన్యాయం అందించటం తమ పార్టీ మౌలికవిధానాలలో ఒకటని జేపీ పేర్కొన్నారు.

**రాజ్యసభలో గ్రామన్యాయాలయాల బిల్లు ఆమోదం, ప్రాణహిత- చేవెళ్లపై లోక్‌సత్తా ప్రత్యామ్నాయంపై ముఖ్యమంత్రి విమర్శల గురించి జయప్రకాష్ నారాయణ్ గురువారం పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికార ప్రతినిధులు కటారి శ్రీనివాసరావు, బి. కృష్ణారెడ్డి కూడా పాల్గొన్నారు.**

ఈరోజు దేశవ్యాప్తంగా దిగువకోర్టుల్లో సుమారు 2.6కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హైకోర్టుల్లో 42లక్షలు, సుప్రీంకోర్టులో 40వేల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని జేపీ పేర్కొన్నారు. మనరాష్ట్రంలో దాదాపు 10లక్షలకు పైగా ఇలా పెండింగ్‌కేసులు ఉన్నాయన్నారు. న్యాయం ఆలస్యం కావటం వల్ల కోట్లమంది సామాన్య ప్రజలకు అన్యాయం జరుగుతోందని, ఈ నిస్పృహను తట్టుకోలేక అసలు కోర్టుల పక్కకే రాని కేసుల సంఖ్య పెండింగ్‌కేసుల కంటే కూడా ఎక్కువని అన్నారు. ప్రజల్లో న్యాయవ్యవస్థ పనితీరు పట్ల ఉదాసీనత, నిరసనను ఆసరాగా చేసుకుని రౌడీదర్బారుల సంస్కృతి పెరుగుతోందని, గూండాలు, రాజకీయ నాయకులు కుమ్మక్కై యధేచ్ఛగా భూకబ్జాలు, ప్రజాధనం లూటీలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేరరాజకీయాలను మార్చే ప్రయత్నంలో భాగంగా లోక్‌సత్తా స్థానిక కోర్టులను (గ్రామ న్యాయాలయాలను) ప్రతిపాదిస్తూ వచ్చిందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి తక్కువ ఖర్చుతో, త్వరితగతిన తీర్పులు వెలువడటం వల్ల ఈ పరిస్థితి మారుతుందన్నారు. ప్రతి మండలంలో కనీసం ఒక స్థానిక కోర్టు ఏర్పాటు చేయవచ్చన్నారు. పార్లమెంటులో చట్టం రూపం ధరించిన అనంతరం, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని, గ్రామన్యాయాలయంలో న్యాయవాదులకు కూడా పాత్ర కల్పిస్తూ, వ్యవహారాలు స్థానికభాషలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వీటన్నిటితోపాటు పోలీసువ్యవస్థలో నేరపరిశోధనకు స్వయంప్రతిపత్తి కల్పిస్తే, స్థానిక న్యాయాలయాల ద్వారా పూర్తిస్థాయి ఫలితాలను సాధించవచ్చని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ✧

# ఫిబ్రవరి 28న తీన్‌మూర్తిభవన్‌లో మన్మోహన్ సింగ్‌కు పీవీ పురస్కారం



సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన గల జ్యూరీ కమిటీ ఈ ఎంపిక చేసింది. జ్యూరీలో జేపీ సభ్యులుగా ఉన్నారు. దేశ ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా, మచ్చలేని వ్యక్తిత్వం గల మన్మోహన్ సింగ్‌ను పీవీ పురస్కారానికి జ్యూరీలోని వారంతా ఏకగ్రీవంగా ఎంపిక చేశామని జేపీ తెలిపారు. కమిటీలో డా॥ సుభాష్ కశ్యప్, డా॥ కార్తికేయన్, నరేంద్ర ఉన్నారని వివరించారు.



దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు తన విధానాలతో, పాలనతో దేశ దశా దిశా మార్చిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రాంతాలకతీతంగా దేశ ప్రజలంతా ఆయన్ను గౌరవిస్తారన్నారు. చెన్నైకి చెందిన 'ఇండియా నెక్స్ట్' సంస్థ నెలకొల్పిన పీవీ నరసింహారావు జీవిత సాఫల్య జాతీయ పురస్కారానికి మాజీ ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేశామని, ఫిబ్రవరి 28న ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తామని హైదరాబాద్‌లో ప్రకటించారు.

పీవీ అన్ని సంస్థలనూ గౌరవించేవారని, ఎవరిపైనా పెత్తనం చేయకుండా మర్యాద పూర్వకంగా చర్చలు జరిపేవారని జేపీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. అందరినీ కలుపుకుని పోయే తత్వమున్నవారని, రాష్ట్రాలను బలోపేతం చేస్తూ ఫెడరలిజం విస్తరణకు కృషి చేశారని అన్నారు. సమాజంలో విలువల్ని ప్రోత్స హించేందుకే ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు.

'సాక్షి' ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ, 'ది ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఇండియన్ ఎకానమీ' పీవీ నరసింహారావు పేరుతో అవార్డు ఇవ్వడం శుభపరిణామమన్నారు. తొలి అవార్డును మన్మోహన్‌సింగ్‌కు ఇవ్వడం సముచిత నిర్ణయమన్నారు. భారతదేశ ఆర్థిక భవిష్యత్తును పరిరక్షించడానికి పీవీ చేసిన కృషి భారతీయులను తలెత్తుకునేలా చేసిందని మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ అన్నారు. ఇండియానెక్స్ట్ బ్రోచర్‌ను జేపీ, రామచంద్రమూర్తి, రాపోలు ఆవిష్కరించారు.

సమావేశానికి ఇండియా నెక్స్ట్ కన్వీనర్ ఎస్.వి సూర్యప్రకాష్ అధ్యక్షత వహించారు. తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త శ్రీలక్ష్మి, యువజన కో ఆర్డినేటర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. ✧

# దేశ చరిత్రలో పి.వి స్థానం కీలకం, పదిలం!

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

మనదేశానికున్న పెద్ద లోటు- సరైన వ్యవస్థల నిర్మాణం లేకపోవటం! నిజాయతీ, సామర్థ్యం, ఆదర్శ భావాల్లో ప్రపంచంలోని ఏ దేశంలోనివారికీ మన ప్రజలు తీసిపోనివారే అయినా, 'మంచిని ప్రోత్సహించే, చెడును నిరుత్సాహపరిచే' వ్యవస్థల నిర్మాణం కొరవడటం దేశంలో దోపిడీని, వివక్షల్ని పెంచి పోషిస్తోంది. చట్టసభల్లో భారీ మెజారిటీ ఉండి, ప్రజల్లో తిరుగులేని ఆదరణ ఉన్న నాయకత్వం దేశాన్ని పాలించిన దశలో.. రాజ్యాంగంలోని ఆ లోపాల్ని తగిన సంస్కరణలతో తేలిగ్గా సరిదిద్దే అవకాశముండేది. కానీ ఆ తర్వాత వచ్చిన నాయకత్వం కూడా.. వ్యక్తుల చుట్టూ అధికారాన్ని, పాలనను తిప్పుకోవటం, మాకు మెజారిటీ లేదు కదా అని దేశానికి అత్యవసరమైన సమస్యల నుంచి కూడా తప్పించుకోవటం ఆనవాయితీ అయింది. అలాంటి పలాయన, స్వార్థపూరిత ధోరణులకమధ్య.. ఆ తరహా నేతలకు భిన్నంగా వ్యవహరించి ఆర్థికరంగంలో సంస్కరణలకు నాంది పలికినవారు శ్రీ పి.వి నరసింహారావు! దేశం గొప్ప సంక్షోభంలో చిక్కుకుని పతనావస్థను ఎదుర్కొంటున్నప్పుడు ఆయన ప్రధాని బాధ్యతల్ని చేపట్టారు. విషయాన్ని అర్థం చేసుకుని సవాలుకు దీటుగా స్పందించారు. అసాధారణ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శించారు. విధిలేని పరిస్థితుల్లోనే ఆర్థికరంగంలో సంస్కరణల్ని చేపట్టారనుకున్నా.. అస్తుబిస్తు మెజారిటీ ప్రభుత్వంగా వాటిని సాధించేందుకు ఆయన చూపిన చాతుర్యం, దూరదృష్టి, దేశభక్తి అపూర్వమైనవి. చేస్తున్నది చాలా పెద్ద పనే అయినా.. ఎక్కడా ఆర్భాటాలు లేవు. కీర్తి కండూతి లేదు. పెద్ద మార్పు కోసం అంటూ హంగామా చేయకుండా.. ఎంతో అణకువతో, ఏకాగ్రతతో అలవోకగా పనిచేసి ఈ దేశంలో ఆర్థిక స్వేచ్ఛకు నాంది పలికారు. ఆయన హయాం కచ్చితంగా మన జాతి నిర్మాణంలో కీలక ఘట్టం! సంక్షోభ సమయంలో... ఓ నిరుపేద సమాజంలో... సోషలిజం, సామ్యవాదాలకు పిచ్చి అర్థానిచ్చిన సమాజంలో... అసమానతలు, కులాలు మతాలున్న సమాజంలో... ఏ రకమైన అస్థిరత్వం లేకుండా కార్మిక సంఘాల్లో, సొంతపక్షంలో, విపక్షంలో, ప్రజలందరిలోనూ ఏకాభిప్రాయాన్ని అలవోకగా నింపాదిగా... సాధించి ఇంత శాంతియుతంగా ఇంత పెద్దమార్పును తెచ్చే ప్రయత్నం ప్రపంచంలో మరే దేశంలోనూ జరగలేదు. పి.వి గొప్పతనం అది! ఆర్థిక సంస్కరణలు కావచ్చు, విదేశీ వ్యవహారాలు కావచ్చు, అణుపరీక్ష వంటి సంచలన విషయాలు కావచ్చు.. నా పేరు కన్పించాలని తపించకుండా, నా దేశం కోసం కొన్ని లక్ష్యాలు నెరవేరాలనే ఉద్దేశంతో నిరాడంబరంగా వెనకాల ఉంటూ సంయమనాన్ని పాటించి కీర్తిని వేరేవారికిచ్చి... సమాజంలో భయాందోళనలు లేకుండా చేసి... అద్భుతమైన చాతుర్యాన్ని, దూరదృష్టిని, దేశభక్తిని ప్రదర్శించారాయన! నేను పలుమార్లు బహిరంగంగానే చెప్పాను- పి.వి ని ఆయన పార్టీ కంటే ఇతర పార్టీలెక్కువగా గౌరవించాయి. స్వరాష్ట్రం కంటే దేశం ఎక్కువగా గౌరవించింది. ఒకరకంగా దేశం కంటే ప్రపంచం ఆయన్ను ఎక్కువగా అవగాహన చేసుకుని గుర్తించింది. కొంతమందికి ఆ దురదృష్టం ఉంటుంది. వాళ్లు చేసేపని చుట్టూ ఉన్నవాళ్లకంటే ఇతరులు, దూరంగా ఉన్నవాళ్లు ముందు గుర్తిస్తారు. కానీ దేశ చరిత్రలో పి.వి స్థానం చాలా కీలకమైంది. పదిలమైంది. తెలుగువాళ్లు, భారతీయులందరూ తలెత్తుకుని ఠీవిగా చెప్పుకోగలిగే రీతిలో పి.వి నరసింహారావు తన పదవులను నిర్వహించారు. ఆయనతో నేను వ్యక్తిగతంగా ఆలోచనల్ని పంచుకునేటప్పుడు ఎంతో మృదువుగా, పరిణతితో, ముందుచూపుతో మాట్లాడేవారు. ఆయనతో సంభాషణ ఎంతో విలువైనదిగా ఉండేది.

'పి.వి లాంటి వ్యక్తి జీవితచరిత్రను రాబోయే తరాలకు అందిస్తే.. వారి భవిష్యత్తును జాగృతం చేసినవారమవుతాము' అంటూ "సంస్కరణల రూపశిల్పి, స్థితప్రజ్ఞ పి.వి నరసింహారావు" పుస్తకాన్ని అందిస్తున్నందుకు సోదరుడు బెల్లి రాజయ్యను మనసారా అభినందిస్తున్నా. చాలా అవసరమైన ఈ కృషిని ఆదరించటం సమాజం బాధ్యత. ✧

(పీవీపై బెల్లి రాజయ్య పుస్తకానికి జేపీ ముందుమాట)

# నవతరం నాయకులు మీరు - భావి (భవిష్యత్తు) మీదేనండి!
# వలసలు వెళ్లాల్సిన అవసరం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

- బండారు రామ్మోహనరావు



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2019లో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. మొత్తం 12,751 పంచాయతీలలో సుమారు పన్నెండు వేల ఏడువందల పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు వచ్చాయి. ఇందులో చెప్పుకోవాల్సిన కొన్ని విశేషాలున్నాయి.

2000 సంవత్సరం జనవరి 1 తర్వాత పుట్టినవారికి 2018 జనవరి తర్వాత పద్దెనిమిది ఏళ్లు నిండుతాయి. ఇరవైఒకటో శతాబ్దపు తొలి ఓటర్లుగా వీరు నమోదైనారు. నవతరం ఓటర్లుగా వీరిని చెప్పుకోవచ్చు. మొన్న 2018 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతోపాటు, ఇప్పటి పంచాయతీ ఎన్నికల్లో కూడా వీరు (జనరేషన్ జడ్) తమ ఓటు హక్కును మొదటిసారిగా వినియోగించుకున్నారు. అందుకే ఓటు గల్లంతు సమస్య స్పష్టంగా ఉన్నప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల్లో 2014 ఎన్నికల్లో కంటే ఓటింగ్‌లో కొంత పెరుగుదల కనిపించింది. అలాగే 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మూడు విడత ల పోలింగ్ శాతాన్ని లెక్క తీస్తే సుమారు 93 శాతం నమోదైంది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ కంటే ఇది 25 శాతం ఎక్కువ కాగా, 2018 శాసనసభ ఓటు శాతం కంటే 20 శాతం ఎక్కువ. ప్రజల కళ్ల ముందు కనబడే ప్రభుత్వంగా చెప్పుకునే పంచాయతీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం సహజమే. తమ ఇంటి ముందో, పక్క ఇంట్లోనో, లేక మరో వీధిలోనో, వాడలోనో ఉండే అభ్యర్థులు సహజంగానే ఓటర్లను పోలింగ్ బూత్‌లలోకి ఆకర్షించగలుగుతారు.

పై అంచెలకు వెళ్లే కొద్దీ ఓటర్ల ఆసక్తి తగ్గుతుండటానికి కారణం ఆ అంచెలు- ఓటర్లకు క్రమక్రమంగా దూరం కావడమే! తమ పన్నుల డబ్బుతో- తమ కళ్ల ముందు కదలాడే- నివాసముండే నాయకత్వం పట్ల ప్రజలు సహజంగా ఆసక్తి చూపుతారు. అదే మండల, జిల్లా పరిషత్‌లతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్లు మరోవిధంగా స్పందిస్తారు. ఇక పార్లమెంటు ఎన్నికలలో పోలింగ్ శాతం మరింత తక్కువగా నమోదు కావడం కూడా సహజమే. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జమిలిగా వచ్చిన సందర్భాన్ని మినహాయిస్తే ఒక్క పార్లమెంటు ఎన్నికలే వస్తే- ఓటింగ్ శాతం తగ్గుతుంది. కానీ ఇక్కడ కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి.

ఓటరు స్థానిక ఎన్నికలో ఎక్కువగా పాల్గొన్నప్పటికీ.. ఓటును మాత్రం ముఖ్యమంత్రిని, రాష్ట్రంలోని పార్టీలను చూసే అనుకూలంగానో, ప్రతికూలంగానో అత్యధికులు వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీలు ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నట్లు కనిపించటనప్పటికీ ఎన్నికలు మాత్రం పార్టీల చుట్టూనే తిరగటం ఇటీవలికాలంలో మరీ ఎక్కువైంది. పార్టీల రాష్ట్ర స్థాయి నాయకత్వం పట్ల ఆకర్షణకు స్థానిక నాయకత్వ జోష్ కూడా తోడయితే, ఇక విజయం నల్లేరు మీద నడకే. ఎక్కడెక్కడో ఉన్నవారిని కూడా ఊళ్లకు రప్పించి ఓటు వేయించే సామర్థ్యం పలువురు స్థానిక నేతల సొంతం. రాష్ట్రంలోని పార్టీలను, నాయకత్వాన్ని చూసి ఓటు వేసే ధోరణి పంచాయతీల్లోనే కాకుండా, పట్టణ ప్రాంత స్థానిక ప్రభుత్వాల్లో కూడా ఉన్నప్పటికీ, అక్కడ ఓటింగ్ శాతం గ్రామాల్లో ఉన్నంత పెద్దస్థాయిలో కనిపించటం అరుదు. హైదరాబాద్ మహానగరం వంటి చోటైతే స్థానిక ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ పలు సందర్భాల్లో నమోదైంది. వీటన్నిటినీ అధిగమించి, ప్రజలు తమ జీవితాన్ని అతి ఎక్కువగా ప్రభావితం చేసే స్థానిక ఎన్నికల్లో ఒక జాతరలా ఓటు వేయాలంటే, తమ ఓటుకు - సబ్బు బిళ్ల నుంచి తాము కట్టే పన్నుల డబ్బుకు - తమ జీవితంలో ఎదిగే అవకాశాలకు మధ్య సంబంధాన్ని వారు అర్థం చేసుకునే



పాలనా మార్పులు అవసరం. మన ప్రజలేమీ మోసకారులో, దొంగలో, తెలివితక్కువవారో కాదు. వారిలోని నిజాయతీ, తెలివితేటలు వికసించాలంటే.. దానికి తగిన వ్యవస్థ, ప్రోత్సాహకాలు ఉండాలి. స్థానిక స్వయంపాలనకు తగిన నిధులు, అధికారాలు ఉంటే, వాళ్లు ముఖ్యమంత్రి గురించో, ప్రధానమంత్రి గురించో ఆలోచించకుండా, పూర్తిగా తమ పంచాయతీలో, వార్డులో పాలనను మెరుగుపరచుకోవటం కోసమే ఓటును సద్వినియోగం చేయటం మీద దృష్టి పెడతారు. ఇలాంటి పాలనకు ఎన్నికల కమిషన్ ప్రచారం, ప్రజాసంఘాల చైతన్యం ఓటరు చైతన్యానికి తోడయితే– ఇక ఆ ప్రజాస్వామ్యంలో ఓటు వేయటం ఒక ఆరోగ్యకరమైన నిత్యపండుగలా మారుతుంది.

తెలంగాణ తాజా పంచాయతీ ఎన్నికల్లో మొదటి విశేషం– యువ ఓటర్లు కీలకపాత్ర వహించటమైతే, రెండవ విశేషం– పెద్దసంఖ్యలో యువ నాయకత్వం వార్డు మెంటర్లుగా, సర్పంచ్‌లుగా ఎన్నిక కావడం. గ్రామాలకు ఎన్నికైన కొత్త ప్రజాప్రతినిధుల సగటు వయసు 35 ఏళ్లలోపే కావడం గమనార్హం. ఓటు హక్కు 18 ఏళ్లకే వచ్చినా, అభ్యర్థులుగా నిలబడాలంటే, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మునిసిపాలిటీలకు కనీస అర్హత వయసు 21 సంవత్సరాలుగా ఉంది. అసెంబ్లీ, పార్లమెంటుకయితే (లోక్‌సభ) 25 సంవత్సరాలు నిండాలి. పార్లమెంటులోని రాజ్యసభకు అయితే ఏకంగా 35 సంవత్సరాలు ఉంటేనే పోటీ చేసే అర్హత ఉంది. అలా చూస్తే 21 నుండి 50 సంవత్సరాల లోపువారే కొత్తగా ప్రజాప్రతినిధులుగా గ్రామాలలో ఎన్నికయ్యారు. ఇక మూడవ విశేషమేమిటంటే– సుమారు 95 శాతం మొదటిసారి వార్డు మెంబర్లుగానో, సర్పంచ్‌లుగానో ఎన్నికయ్యారు. గతంలో ఈ పదవులకు ఎన్నికైనవారు కేవలం ఐదు శాతం లోపే ఉండటం యాదృచ్ఛికం కాదు. యువతకు రాజకీయాల పట్ల ఏదోకరూపంలో ఆసక్తిగా ఈ పరిణామాన్ని చెప్పుకోవచ్చు.

ఇక ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం ఎందుకు పొందకూడదని మొత్తం పదవులలో 50 శాతం మహిళలకు అవకాశం వచ్చింది. 73వ రాజ్యాంగ సవరణలో– చట్టప్రకారం 33 శాతానికి మహిళలకు అవకాశం ఇచ్చారు. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల నుండే మహిళలకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్ అవకాశం ఇచ్చి గౌరవించుకున్నాము. ఆ అవకాశం తెలంగాణలో రాష్ట్రంలోని తొలి పంచాయతీ ఎన్నికల్లో కూడా కొనసాగించారు. ఇది నాలుగవ విశేషం.

ఇక ఐదవ విశేషము ఏమిటంటే– ఎస్.సి, ఎస్.టి, బీసీల రిజర్వేషన్ల రొటేషన్ పద్ధతి ఐదేళ్లకోసారి మారేది. పదవి చేపట్టి అధికారం పరిధి, అవకాశాల గురించి తెలుసుకుని అనుభవం వచ్చేలోగా ఐదేళ్లు పూర్తయిపోయేవి. రెండవసారి రిజర్వేషన్లు మళ్లీ రొటేషన్ పద్ధతిలో నిర్ణయించడం వల్ల రిజర్వేషన్ల మూలంగా పాతవారికి రెండవసారి పోటీ చేసే అవకాశం రాకపోయేది. అంటే ఆసక్తి, అనుభవం ఉన్నా, గ్రామాన్ని ఎంత అభివృద్ధి చేసినా– రెండవసారి పోటీ చేసే అవకాశం చాలా తక్కువగా ఉండటంతో– రెండు అనర్థాలు జరిగాయి. మనం ఉండేది ఐదేళ్ల పరిమిత కాలానికే కదా, అలాంటప్పుడు– రాముడెవ్వడో, అసురుడెవ్వడో– కనుక అందినకాడికి దండుకుందామనే మనస్తత్వంతో 'అవినీతి' పేట్రేగిన సందర్భం చూశాము. రెండవసారి రాముగనక– ఏమి చేసినా, మళ్లీ అవకాశం రాదు కనుక నియంతృత్వ పోకడలకూ– ఇది దారితీసింది.

ఈసారి కొత్త పంచాయతీ చట్టంలో ప్రధాన మార్పు ఏమిటంటే– ప్రతీ రిజర్వేషన్‌నూ రెండు పర్యాయాలు కొనసాగనివ్వడం. అంటే, తెలంగాణ రాష్ట్రంలో 2019లో ఏ రిజర్వేషన్లు ప్రకటించారో, 2024లో కూడా అవే వర్గాలకు ఆయా సీట్లలో అవే రిజర్వేషన్లు రెండవసారి కొనసాగుతాయి. దీనివల్ల 'రిజర్వేషన్లు ఒక దుర్భేద్యమైన జూదం'గా మారిన పరిస్థితి నుండి, అదృష్టాన్ని పరీక్షించుకునే లాటరీ తరహా నుండి– రెండవసారి కూడా పోటీ చేసే అవకాశం ఆయా వర్గాలకు దక్కింది. మంచి చేస్తే మళ్లీ ఎన్నిక కావచ్చు అనే

సకారాత్మక దృక్పథాన్ని ఇది పెంపొందింప చేసింది. మళ్లీ పోటీ చేసే అవకాశం ఉందనే ఆశ.. అవినీతి పాలనను కొంత తగ్గిస్తుంది. ఆశ దురాశగా మారకుండా అరికడుతుంది. రెండవసారి రిజర్వేషన్లు చాలా ఏళ్ల నుండి అమలు చేస్తున్న తమిళనాడులాంటి రాష్ట్రం సరసన మన తెలంగాణ రాష్ట్రం కూడా చేరింది. మహిళల, యువ నాయకత్వానికి పెద్ద పీట వేసింది.

**అంగడిసరకుగా మారిన ప్రజాస్వామ్యం**

ఇలాంటి విశేషాలతో కూడిన ఎన్నికల్లో కూడా ప్రజాస్వామ్యం అంగడి సరకు స్థాయి నుండి ఎదగడకపోవడం దురదృష్టకరం. గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే పదింతలు ఖర్చుకావడం– అభ్యర్థులు, అడ్డగోలుగా మద్యం, డబ్బులే కాకుండా చీరలు, సారెలు, సెల్‌ఫోన్లు, బంగారు, వెండి ఆభరణాలను ఓటర్లకు ఎరగా చూపడంతో ఈ పంచాయతీ ఎన్నికలు ఖరీదులో కొత్త రికార్డును సృష్టించాయి. ప్రతి ఒక్క ఓటూ కీలకమే కనుక– చివరి ఓటు వరకు కొనుగోలు కార్యక్రమం యధేచ్ఛగా జరిగింది. ఇక వేలం పాటల ఏకగ్రీవాలు, కులాల కూటములు.. ఏకగ్రీవ ఎన్నిక స్ఫూర్తిని నీరుగార్చాయి. ఎక్కడో ఒకటీ అరా, నిజమైన ఏకగ్రీవ ఎన్నికలు జరిగితే జరగొచ్చుగాక (నల్గొండ జిల్లా నాంపల్లి మండలం మల్లపురాజుపల్లి గ్రామస్తులు ప్రలోభాలకు లొంగకుండా, ఖర్చుల కోసం విరాళాలిచ్చి మరీ విశ్రాంత ఉపాధ్యాయుడు మునగాల సుధాకర్‌రెడ్డిని సర్పంచ్‌గా పోటీచేయించి గెలిపించుకున్నారు. వృద్ధాప్య పింఛనుదారులు కూడా విరాళాలిచ్చారు. ఈ ఎన్నికల్లో రూ. 2 వేలు నామినేషన్ దాఖలుకు, రూ. 3 వేలు కరపత్రాలకు ఖర్చు చేశానని, చందాల రూపంలో వచ్చిన రూ.1,70,000 లలో మిగిలిన నిధులను గ్రామాభివృద్ధికే వినియోగిస్తానని సర్పంచ్ తెలిపారు), మూకుమ్మడిగా గ్రామం గ్రామమే అంగడి సరుకుగా మారి అమ్ముడుపోయిన లజ్జాకరమైన సంఘటనలు పంచాయతీ ఎన్నికలలో ఎన్నడూ లేనంత దుర్మార్గ కోణాన్ని చూపించాయి.

ఏదేమైతేనేం– ఎన్నికలు జరిగాయి. కొత్త పాలక వర్గాలు గ్రామాలలో కొలువు తీరాయి. ఇక ఇప్పుడేం చేయాలో ఆలోచిద్దాం. నిరాశావాదం పరిష్కారం కాదు .. సానుకూలతల నుంచే మార్పును ప్రేరేపించాలి.

2013లో జరిగిన ఎన్నికలపుడు తెలంగాణ రాష్ట్రంలో



ఉన్న 8,000 పంచాయతీలకు తోడు, కొత్తగా 2018లో మరో 4,000పైచిలుకు పంచాయతీలు తోడై, 12,751 పంచాయతీలు లెక్క తేలాయి. పాత పంచాయతీలలో, వందల సంఖ్యలో కొత్తగా ఏర్పడ్డ మునిసిపాలిటీలలో చేరాయి. 'మావాగావ్, మావారాజ్' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రంలో మూడు వేలకుపైగా తండాలు కొత్త పంచాయతీలుగా అవతరించాయి. పెద్ద పంచాయతీల్లో, అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న మరికొన్ని శివారు పల్లెలు కూడా కొత్త పంచాయతీలుగా మారాయి. ఇవన్నీ అభివృద్ధి పథంలో నడవాల్సి ఉంది.

కొత్త పంచాయతీలతోపాటు నూతనంగా ఎన్నికైన పాలక వర్గాలకు శిక్షణ ద్వారా తాము చేయాల్సిన పనుల గురించి– గ్రామాలలో శిక్షణనిచ్చే కార్యక్రమాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇదొక శుభపరిణామం. వచ్చే ఆరు నెలల్లో వరుసగా మండల, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలు, సహకార ఎన్నికలతో పాటు దేశ పార్లమెంటుకఎన్నికలు కూడా జరగనున్నాయి. కనుక ఇది ఎన్నికల నామసంవత్సరంగా చెప్పుకోవచ్చు. మరో ఆరు నెలలు గ్రామాల్లో నిత్య రాజకీయ వాతావరణం తప్పదు. అసలైన అభివృద్ధికి మరో ఆరునెలలు ఆగాల్సిందే. అందాక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కనుక– గ్రామాలకు నిధుల రాబడి కూడా తక్కువే. కనుక ఈ ఆరు నెలల కాలం కొత్త నాయకులు చేయాల్సిన పనుల గురించి చెప్పుకుందాం.

**వలసలు వెళ్లాల్సిన అవసరం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి. అందుకోసం..**

**1. లక్ష్యం:** కొత్త పాలక వర్గాలు తమ గ్రామాలకు వచ్చే ఐదేళ్లూ ఏమి చెయ్యాలో ఒక లక్ష్యం పెట్టుకోవాలి.

**2. మార్గం:** ఎంత మంచి లక్ష్యం పెట్టుకున్నా దానికి చేర్చాల్సిన మార్గం కూడా మంచిదే కావాలన్న గాంధీ సూక్తిని మరువరాదు.

దానికి మార్గనిర్దేశనం చేసుకోవాలి. అధికారులను కలవడం, పైనున్న వ్యవస్థలు, ప్రజాప్రతినిధులతో చర్చించడం- మండల, జిల్లా పరిషత్, ఎమ్మెల్యే, ఎంపీల నుండి గ్రామాలకు వచ్చే నిధులను అంచనా వేయడం చేయాలి. పెత్తనంతో కాదు, ప్రేమతో వ్యవహరించాలి, సంయమనం పాటించాలి.

**3. గ్రామం మీద అవగాహన..** మన ఊరు - మన ప్రణాళిక: మొదటగా తమ గ్రామం మీద ఒక అవగాహన ఏర్పరచుకోవాలి. మీ గ్రామంలో జనాభా ఎంత అనే ప్రశ్న- గ్రామంలో ఎవర్నడిగినా 'సంఖ్య' చప్పున చెప్పేస్తారు. దురదృష్టమేమిటంటే, ఆ సంఖ్య జనాభాది కాదు, ఆ గ్రామ ఓటర్ల సంఖ్య. జనాభా సంగతి సామాన్య జనానికే కాదు, ఎన్నికైన సర్పంచ్‌లకు కూడా చాలామందికి తెలియదు. వారు చూసే దృక్పథం ఓటు బ్యాంకు రాజకీయమే కనుక, ఓటర్ల సంఖ్యను గుర్తుంచుకుంటున్నారు. జనాభాను మర్చిపోతున్నారు.

**4. సర్వే:** గ్రామంలో పౌరులకు ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు, ఇంకా కొత్తగా కావాల్సిన సౌకర్యాలు ఏమిటి అనేది ఒక సర్వే చేపట్టాలి. ప్రభుత్వ శాఖల వద్ద- ఇప్పటికే ఉన్న సమాచారాన్ని తీసుకోవాలి.

5. మౌలిక వసతుల సర్వే చేయాలి.

6. కొత్తగా చేపట్టాల్సిన- అభివృద్ధి పనులను గుర్తించాలి.

7. సామాజిక పరిస్థితులు- సామాజిక అసమానతలను గుర్తించాలి.

**8. విద్య, ఆరోగ్య, ఉపాధి అవకాశాలు:** వనరులు, సంస్థలను సందర్శించి గ్రామాలవారీ వసతులను గుర్తించాలి. కొరతలను గమనించాలి. సామాజిక చైతన్యానికి ప్రయత్నించాలి.

**9. నిధులు - అంచనా:** పనులు చేయాలంటే నిధులు కావాలి. గ్రామానికి యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధుల గురించి తెలుసుకోవాలి.

**10. స్వంత వనరులు:** గ్రామ పంచాయతీకి ఇంటి పన్నుల నుండి మొదలుపెట్టి, నీటి పన్ను, మంచినీరు, లైసెన్సులు, ప్రకటనల ద్వారా వచ్చే స్వంత ఆర్థిక వనరుల గురించి ఒక అవగాహనకు రావాలి.

**11. పన్నులు - సేవలు:** పన్నులు వసూలు చేస్తే మళ్లీ గెలవమనే అపోహ వీడాలి. పన్నులకు తగ్గ సేవలు అందిస్తే- గ్రామస్తులు తప్పక పన్నులు కడతారు. పంచాయతీ పాలక వర్గాలు తాము ముందే పన్నులు చెల్లించి గ్రామానికే ఆదర్శం కావాలి.

**12. ఎన్నికల వరకే పార్టీ రాజకీయాలు:** ఎన్నికల వరకే పార్టీ రాజకీయాలుండాలి. ఆ తర్వాత అంతా అభివృద్ధి మంత్రమే పఠించాలి. దానికి పాలకవర్గం కక్షసాధింపు చర్యలు మానాలి. గ్రామమంతా మనదే అనే భావన పెరగాలి.

**13. మాజీల సహకారం:** గ్రామానికి చెందిన గతంలో సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పనిచేసిన వారుంటే- వారితో సమావేశమై గ్రామాభివృద్ధి గురించి చర్చించాలి. వారి సలహాలు, సూచనలు తీసుకోవాలి. వారిని అభివృద్ధిలో భాగం చేయాలి. వారి సహకారం తీసుకోవాలి.

గ్రామాభివృద్ధి అనే 'ఉట్టి' కొట్టటమే లక్ష్యం అయినప్పుడు, ఎవరితో కలిసి లక్ష్యం సాధించామో- అప్రస్తుతమవుతుంది. కార్యసాధనే మనను నడిపిస్తుంది.

**14. బృంద నాయకత్వాన్ని పెంపొందించాలి:** అంతా నా ఇష్టం.. అనే పాట పాడుతూ- ఇష్టారాజ్యంగా పాలన చేయకుండా, గ్రామంలోని అందరినీ కలుపుకుని బృంద నాయకత్వాన్ని పెంపొందించాలి.

**15. ప్రజలకూ - పాలనకు వారధిగా మారాలి:** ప్రజల అపరిమితమైన కోరికలకూ, పరిమితమైన వనరులకూ మధ్యన సమన్వయం చేసుకోవాలి. ప్రజలకూ- పాలనకు మధ్య వారధిగా మారాలి.

**16. దాతల సహకారం:** గ్రామాలలో వనరుల కొరతను అధిగమించడానికి గ్రామంలోని- ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులతోపాటు ఎన్.ఆర్.ఐలు ఉంటే వారి సహకారంతో- అభివృద్ధి నిధులు సేకరించాలి. ఆయా నిర్మాణాలకు వారి పేరు కూడా పెట్టాలి. గ్రామ సభలలో, ఇతర సమావేశాలలో భూరి విరాళాలిచ్చిన దాతలను పొగడాలి. సన్మానాలు చెయ్యాలి. వారి దాతృత్వాన్ని గుర్తించాలి- వారి సేవలను అభినందించాలి.

17. గ్రామం నుంచి రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహకారం తీసుకొని వారి నైపుణ్యాన్ని వినియోగించుకోవాలి. వారిని గౌరవించాలి. అలాగే మండల, జిల్లా అధికారులను

సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవాలి. తమ గ్రామ సమస్యల పరిష్కారానికి వారి సహకారాన్ని కోరాలి.

**18. సమావేశాలు:** పంచాయతీ సమావేశాలు నెలకు ఒకసారి తప్పక నిర్వహించాలి. గ్రామసభలను ప్రతి రెండు నెలలకు ఒకసారి (కొత్త చట్టం ప్రకారం) నిర్వహించాలి. ఈ సమావేశాల్లో చర్చించాలి. నిర్ణయాలను తీసుకురావాలి.

**19. లబ్ధిదారుల ఎంపిక:** లబ్ధిదారుల ఎంపిక, అది రేషన్ కార్డు కావచ్చు, ఇల్లు, ఇంకా పెన్షన్లు, సామాజిక సంక్షేమ పథకాలు కావచ్చు. లబ్ధిదారుల ఎంపికను తప్పక గ్రామసభలలో జరపాలి. పారదర్శకత ద్వారా జవాబుదారీతనానికి పెద్దపీట వేయాలి.

20. సమావేశాలకు నిపుణులను ఆహ్వానించాలి. విద్య, ఆరోగ్య, వ్యవసాయ రంగాలలో నిపుణులతో సలహాలు, సూచనలు ఇప్పించాలి.

**21. ఫంక్షనల్ కమిటీ:** కార్యనిర్వాహక కమిటీలలో- విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, మంచినీరు, పారిశుద్ధ్య కమిటీలు కీలకంగా పనిచేయాలి. అందులో పార్టీ రాజకీయాలకు అతీతంగా ఆసక్తి గలవారిని కమిటీ మెంబర్లుగా ఎంపిక చేయాలి.

22. ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన విధంగా, మిలీనియం గోల్స్ (సహస్రాబ్ది లక్ష్యాలు)తోపాటు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)ను గమనంలోకి తీసుకోవాలి.

**23. అభివృద్ధి అర్థం మార్చాలి - అర్థవంతం చేయాలి:** మానవాభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం, రోడ్ల నిర్మాణమే కాదు. సమాజాభివృద్ధిలో విద్య, ఆరోగ్యాలతోపాటు, వ్యవసాయం, పశుపోషణ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా అంతిమంగా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించాలి.

24. వలసలు పోవాల్సిన అవసరం లేని నివాసయోగ్యమైన గ్రామంగా తీర్చిదిద్దాలి

"అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడూ ఎడతెగక పారు ఏరును ఉన్న ఊర్లోనే ఉండమన్న అన్న సుమతి శతకకారుడి పద్యాన్ని గుర్తు పెట్టుకోవాలి.

దోమలు, ఈగలు, పెంటకుప్పలు లేని గ్రామాన్ని, కడుపు నిండా పౌష్టికాహారం, చేతి నిండా పని ఉన్న గ్రామాన్ని, సామాజిక అసమానతలు లేని గ్రామాన్ని, ప్రజల భాగస్వామ్యంతో నడిచే గ్రామాన్ని నిర్మించుకోవాలి.

నాయకత్వానికి మెరుగులు దిద్దుకోవాలి,
నవశకానికి నాంది పలకాలి. ✧

## లోక్‌సత్తా, పౌరుల విజయం: ముఖ్యమంత్రి సొంతింటి ముందు హెలిప్యాడ్‌కు భూసేకరణ ఉత్తర్వులను నిలుపుదల చేసిన ప్రభుత్వ యంత్రాంగం

కరీంనగర్ జిల్లా తీగలగుట్ట గ్రామం సర్వే నెంబర్ 232లో ముఖ్యమంత్రి హెలిప్యాడ్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ ఉత్తర్వులను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఇప్పటికే రెండు హెలిప్యాడ్‌లున్నాయని, అయినా మళ్లీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంతింటి ముందు హెలిప్యాడ్ కోసమంటూ ప్రజల నివాసభూముల్ని సేకరించటం తగదని లోక్‌సత్తా ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. కొందరు పౌరులు కూడా కోర్టును ఆశ్రయించారు. భూసేకరణ చట్టం-2013 నిబంధనలను కూడా పట్టించుకోకుండా సేకరణకు ఆదేశాలు జారీ చేశారని వాదించారు. సమీపంలో కేసీఆర్, ఆయన బంధువుల భూములు ఉన్నప్పటికీ ఇతరుల భూములను సేకరిస్తున్నారని బాధితుల తరపు వాదనను వినిపించారు. దీంతో, భూసేకరణకు సంబంధించి పూర్తి



వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రెవెన్యూ, ఆర్ అండ్ బీ, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఆర్డీవోలను హైకోర్టు ఆదేశించింది. దీనిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవటంతో, భూ సేకరణకు సంబంధించిన ఉత్తర్వులను నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ప్రకటించారు.

# 'తెలంగాణలో పంచాయతీలు'.. ఇంకా సగానికిపైగా అధికారాల్ని బదిలీ చేయాల్సి ఉంది

ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు, సామాజిక పథకాల అమలుకు పంచాయతీలకు రాజ్యాంగ సవరణ ప్రకారం 29 అధికారాలను దఖలు పరచాల్సి ఉండగా.. తెలంగాణలో ఇంతవరకూ 13 అధికారాలను మాత్రమే బదలాయించారు. పలు రాష్ట్రాలు అధికారాలను బదిలీ చేయటం లేదంటూ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. కేరళలో మాదిరిగా అన్ని అధికారాలు పంచాయతీలకు లభిస్తే.. అవి స్వయంపాలనతో ప్రగతి పథంలో పయనించేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ మేరకు రాష్ట్రాలను ఒప్పించేందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ముమ్మర ప్రయత్నాలు చేయాలని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది.

కనీసం పశుగ్రాసం, సంప్రదాయేతర ఇంధన వనరులు, గ్రామీణ విద్యుత్, వయోజన విద్య, చిన్నతరహా పరిశ్రమలు వంటి వాటినైనా పలు రాష్ట్రాలు అప్పగించలేదని కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రాలు మూడు రకాల 'ఎఫ్'లను (ఫండ్స్, ఫంక్షన్స్, ఫంక్షనరీస్) బదలాయించాలని స్పష్టం చేసింది. పలు రాష్ట్రాల్లో గ్రామసభలు మొక్కుబడిగా తయారయ్యాయని.. గ్రామస్తుల హాజరు శాతం తక్కువగా ఉంటోందని పేర్కొంది.

**బలోపేతానికే కొత్త చట్టం తెచ్చాం**

కాగా, పంచాయతీలను బలోపేతం చేయటానికే కొత్త చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ పేర్కొంటోంది. వాటికి మరిన్ని బాధ్యతలను, విధులను అప్పగించాలంటే తొలుత చట్టపరమైన ఏర్పాట్లు చాలా అవసరమని, అటువంటి అంశాలు 1994 చట్టంలో లేనందునే దాన్ని రద్దు చేసి 2018, ఏప్రిల్ నుంచి కొత్త చట్టాన్ని తెచ్చామని ఆ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఉద్యోగుల పాత్ర, బాధ్యతలను కొత్త చట్టంలో నిర్వచించినందున పరిపాలన మెరుగుపడుతుందని, వారిలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన విశ్లేషించారు.

**తెలంగాణలో పంచాయతీలకు ఇవ్వాల్సిన 16 అధికారాలు ఇవి:**

1. సామాజిక అడవులు 2. ఇంధనం, పశుగ్రాసం 3. ఖాదీ, గ్రామీణ, కుటీర పరిశ్రమలు 4. సంప్రదాయేతర ఇంధన వనరులు 5. విద్యుత్ పంపిణీ, గ్రామీణ విద్యుదీకరణ 6. ఆహారశుద్ధి, చిన్నతరహా పరిశ్రమలు 7. వయోజన, అనియత విద్య 8. సాంస్కృతిక కార్యక్రమాలు 9. కుటుంబ సంక్షేమం 10. గ్రంథాలయాలు 11. సామాజిక ఆస్తుల నిర్వహణ 12. మార్కెట్లు, ఫెయిర్లు 13. ప్రజాపంపిణీ 14. గ్రామీణ గృహనిర్మాణం 15. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, ఫెర్రీలు, జలమార్గాలు, రవాణాకు చెందిన ఇతరత్రా 16. సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య

**పంచాయతీలకు అప్పగించిన 13 అధికారాలు ఇవీ:**

వ్యవసాయం, విస్తరణ, పశుసంవర్ధకం, మత్స్యపరిశ్రమ, భూమి అభివృద్ధి, చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, నీటి నిర్వహణ, చిన్నతరహా సాగునీటి వనరులు, తాగునీరు, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలతో సహా విద్య, పీహెచ్‌సీలతో సహా వైద్యం, పారిశుద్ధ్యం, దారిద్ర్య నిర్మూలన పథకాలు, సామాజిక సంక్షేమం, ఎస్.సి, ఎస్.టిలు, బలహీన వర్గాల సంక్షేమం, స్త్రీ, శిశు అభివృద్ధి. ✧




**"ఇరవైమంది కేంద్రంలో కూర్చుని ప్రజాస్వామ్యాన్ని నడపలేరు. కేంద్రీకరణలో ప్రజాస్వామ్యం ఉండదు. ఆ అధికారాన్ని 7 లక్షల గ్రామాలకు పంపిణీ గావించాలని నా కోరిక.**

**- మహాత్మాగాంధీ**

## 'రాష్ట్ర విభజన - ఆంధ్రప్రదేశ్‌కు యూనియన్ హామీలు - వాటి అమలు - ప్రస్తుత స్థితి'

# స్వతంత్ర నిపుణుల బృందం నివేదిక ఢిల్లీలో విడుదల




'రాష్ట్ర విభజన – ఆంధ్రప్రదేశ్‌కు యూనియన్ హామీలు – వాటి అమలు – ప్రస్తుత స్థితి'పై వాస్తవాల ఆధారంగా, నిష్పాక్షికంగా, పార్టీలు, భావోద్వేగాలకతీతంగా ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ – ఎఫ్‌డిఆర్) చొరవతో స్వతంత్ర నిపుణుల బృందం (ఇండిపెండెంట్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ – ఐజిఇ) రూపొందించిన నివేదికను.. 'ఉత్తరాంధ్ర చర్చా వేదిక' ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఢిల్లీలో విడుదల చేశారు.

నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదముద్ర వేసిన తెలుగేతర రాష్ట్రాల నిపుణులు (నేషనల్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ – ఎన్‌జిఇ) కూడా పాల్గొన్నారు.

ఢిల్లీ ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో.. వైకె అలగ్ (కేంద్ర మాజీ మంత్రి, ఎన్‌జిఇ సభ్యులు), జస్టిస్ ఎంఎన్ రావు (హిమాచల్‌ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఐజిఇ సభ్యులు), ప్రొఫెసర్ అతుల్ శర్మ (13వ ఆర్థిక సంఘం సభ్యులు, ఎన్‌జిఇ సభ్యులు), కె. పద్మనాభయ్య (కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి, ఐజిఇ సభ్యులు), అజేయ్ కల్లాం (ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, ఐజిఇ సభ్యులు), కొణతాల రామకృష్ణ (మాజీ ఎంపీ, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్), భీశెట్టి బాబ్జీ (లోక్‌సత్తా), డా॥ జయప్రకాష్ నారాయణ్ (ఐజిఇ కన్వీనర్, ఎఫ్‌డిఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు) నివేదికను విడుదల చేశారు.

నివేదికను జనవరి 7న తొలుత విజయవాడలో విడుదల చేశామని, రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలకూ, శాసనసభా పక్ష నాయకులకూ అందించామని, ఇందులోని అంశాలను, ఫెడరల్ దృక్కోణాన్ని జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు, పార్లమెంటు సభ్యులకు కూడా వివరించేందుకు ఢిల్లీలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని జేపీ వివరించారు.

విభజన కారణంగా హైదరాబాద్ మహానగర ఆదాయాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు 2014–15 రెవెన్యూ లోటునే ఇంతవరకూ భర్తీ చేయలేదని, పోలవరం విషయంలో కేంద్ర–రాష్ట్రాల మధ్య మంచి సమన్వయం కనిపిస్తున్నా, ప్రత్యేక సాయం సహా పలు అంశాల్లో యూనియన్ ప్రభుత్వం తీరు ఉదాసీనంగా, కొన్నిచోట్ల బాధ్యతా రహితంగా ఉందని జేపీ అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 90 శాతం మేర ఉండాల్సిన కేంద్ర వాటాకు బదులు ఇవ్వాలని ప్రతిపాదించిన రూ. 16,447 కోట్ల ప్రత్యేకసాయం లెక్కపరంగా సరిగానే ఉన్నా, ఆ నిధుల్ని బదిలీ చేయటానికి అనుసరిస్తున్న ఇఎపి (విదేశీ తోడ్పాటు ప్రాజెక్టుల) పద్ధతి అందుకు సరిపోదని అన్నారు. అద్భుతమనే రీతిలో ప్రత్యేక సాయాన్ని అందించినా కూడా ఇఎపి ద్వారా ఐదేళ్లలో రూ. 5,000 కోట్లను మించి ఆంధ్రప్రదేశ్‌కు అందించటం సాధ్యం కాదన్నారు. దానికి బదులు నాబార్డ్, హడ్కోల ద్వారా రుణాలు తీసుకోవటానికి ఏపీకి అవకాశం కల్పించి, వాటిని కేంద్రం భర్తీ చేయాలని, ఆంధ్రప్రదేశ్ సహాయ బాండ్లను విడుదల చేయాలని నివేదికలో సూచించామన్నారు. అలాగే రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా సహాయాన్ని అందిస్తామని యూనియన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ ప్రకారం రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర 7 జిల్లాలకు రూ. 24,500 కోట్లు రావాల్సి ఉన్నా, ఏడాదికి జిల్లాకు రూ. 50 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. రాష్ట్ర ప్రజల ఏకాభిప్రాయం, శాసనసభ ఆమోదం లేకుండా విభజన చేయడంతో సమస్యలు వచ్చాయని, ఇకముందు ఇలాంటి విభజనలు చేయకుండా ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. యూనియన్ ప్రభుత్వం నుంచి రూ. 1,16,000 కోట్లు రావాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, అయితే

తాము మాత్రం రాష్ట్ర ప్రభుత్వ సొంత పథకాలకు సంబంధించిన అదనపు భారాన్ని కేంద్రం చెల్లించడం తగదనే భావనతో వాటిని మినహాయించామన్నారు. అంతిమంగా పోలవరం కాకుండా, రూ.86,000 కోట్లు రావాల్సి ఉందని తేల్చినట్లు చెప్పారు. మిగిలిన లోటులో కేంద్రం తన విచక్షణాధికారాన్ని ఉదారంగా ఉపయోగించాలని సూచించామన్నారు. ప్రత్యేకహోదాలో తీవ్ర వివాదాస్పదమైన పారిశ్రామిక పన్ను రాయితీల అంశానికి నివేదికలో మూడు ఆచరణాత్మక పరిష్కారాల్ని చూపామన్నారు. వినియోగ ధృవపత్రాలు (యూసీలు) పెద్ద సమస్య కాదని, మౌలిక వసతులు, రాజధానికి రవాణా సౌకర్యాల అనుసంధానం, జాతీయ ప్రాధాన్యత గల సంస్థల ఏర్పాటును నిర్ణీత కాలవ్యవధిలో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. తెలంగాణ సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలతో తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ సమానస్థాయికి రావటానికి 14 ఏళ్లు పడుతుందని, అలాగే ఏపీలో కూడా సగానికిపైగా ఉండే ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు రాష్ట్ర సరాసరి కంటే కూడా వెనుకబడి ఉన్నాయని అన్నారు. ఈ వెనుకబాటుతనాన్ని సరిచేసే రీతిలో ఫెడరల్ స్ఫూర్తితో న్యాయమైన పరిష్కారాలను దేశవ్యాప్తంగా అవగాహన ఉన్న సుప్రసిద్ధులైన స్వతంత్ర నిపుణులు అందించారన్నారు. ప్రజలు ఈ వాస్తవాలను తెలుసుకుని పరిష్కారాల కోసం పట్టుబట్టాలని, ఈ సిఫారసులను యూనియన్ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని ఏపీకి న్యాయం చేయాలని అన్నారు.

13వ ఆర్థికసంఘం మాజీ సభ్యుడు ప్రొ. అతుల్‌శర్మ మాట్లాడుతూ.. ఇది వరకు రాష్ట్రాలను విభజించినప్పుడు ఆర్థిక సంఘాలు వాటిపై ప్రత్యేకదృష్టి సారించేవని, ఫలితంగా వాటికి ప్రత్యేక గ్రాంట్లు దక్కేవని తెలిపారు. విభజనలో హైదరాబాద్ తెలంగాణకు వెళ్లిపోయిందని, పలు వెనుకబడిన ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌కు మిగిలాయని అన్నారు. ఏపీలోని ఏడు వెనుకబడిన జిల్లాలకు ఇదివరకటి ప్రణాళికా సంఘం తరహాలో ఆర్థిక సంఘం ప్రత్యేక సాయం చేయాలని సూచించారు. హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎం.ఎన్ రావు మాట్లాడుతూ, చిన్న రాష్ట్రాలుంటే కేంద్రం బలంగా ఉంటుంది.. పెద్ద రాష్ట్రాలుంటే కేంద్రం బలహీనంగా ఉంటుందనే భావన ఉందన్నారు. యూనియన్ బలహీనంగా ఉండకూడదని, అదే సమయంలో బలంగా ఉన్న రాష్ట్రాలపై యూనియన్ ప్రభుత్వం నిరంకుశంగా, పెత్తనం చేయడం తగదని అన్నారు. దేశ ప్రధాని పార్లమెంటులో ఇచ్చిన హామీ చట్టం లాంటిదని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దాన్ని అమలు చేసి తీరాల్సిందేనని స్పష్టం చేశారు.

కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రధాని చెప్పినదాని దాకా పోకుండానే.. అసలు చట్టంలో పేర్కొన్న అంశాలను కూడా అమలు చేయడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో నాలుగు సెక్షన్లు చదివితే యూనియన్ ప్రభుత్వం ఏం చేయలేదో అర్థమవుతుందన్నారు. పార్లమెంటులో ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీయే కాకుండా పార్లమెంటు ఆమోదించిన చట్టంలో చాలా హామీలు ఉన్నాయని అన్నారు. విశాఖపట్నంలో మెట్రో రైలు సాధ్యాసాధ్యాలను ఆరు నెలల్లో తేల్చి అమలు చేస్తామన్నారని.. రెండేళ్ల తర్వాత మెట్రో ఇవ్వలేమనడం సరికాదని అన్నారు. అలాగే రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ వంటి అంశాలను పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రం అమలు చేస్తున్న తీరును చూస్తుంటే, మరో 50 ఏళ్లకు ప్రాజెక్టులు పూర్తవుతాయోమనన్నారు.

కేంద్ర ప్రణాళిక, శాస్త్ర సాంకేతిక శాఖ మాజీ మంత్రి ప్రొ. యోగేందర్ కె. అలగ్ మాట్లాడుతూ, ఇలాంటి కసరత్తే బాంబే రాష్ట్రం గుజరాత్, మహారాష్ట్రలుగా విడిపోయినప్పుడు జరిగిందన్నారు. సమానత్వం, పనితీరు అనేవి సమాఖ్య స్ఫూర్తిలో ముఖ్యమైనవని అన్నారు.

కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో భాగం కాదనే రీతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బుందేల్‌ఖండ్ ప్యాకేజీలో ఒక్కొక్కరికి రూ.6,000 వస్తే, ఏపీలో వెనుకబడిన జిల్లాల ప్రజలకు ఒక్కొక్కరికి రూ.40 కూడా రాలేదన్నారు. నిపుణులు తేల్చిన నివేదికపై సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరమైన పోరాటం చేస్తామన్నారు.


నివేదిక వివరాలను అజేయ్ కల్లాం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

కార్యక్రమంలో ఎంపీ అవంతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

(యూనియన్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలను, రెండు ప్రభుత్వాలూ అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలను వినియోగించుకుంటూ గణాంకాలను నిష్పాక్షికంగా, పార్టీలు, భావోద్వేగాలకతీతంగా విశ్లేషించి స్వతంత్ర నిపుణులు ఈ నివేదికలో విలువైనరీతిలో అభిప్రాయాలను వెల్లడించటంతో పాటు.. ఇతర రాష్ట్రాలతో వివాదం లేకుండా, కేంద్రంపై ఆర్థిక భారం లేకుండా, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్ని నెరవేర్చటానికి ప్రామాణిక పరిష్కారాలను చూపారు. ఫెడరలిజంలో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఉండాల్సిన సమతూకాన్ని పాటిస్తూ.. ఎక్కడా కేంద్రం అనే పదాన్ని వాడకుండా యూనియన్ ప్రభుత్వం అని మాత్రమే నివేదికలో ప్రస్తావించారు)✧

# ఏపీకి 'ప్రత్యేక హోదా పన్ను రాయితీలు' ఇవ్వడానికి మూడు మార్గాలు..

## విభజన చట్టంలోని 10 అంశాలపై స్వతంత్ర నిపుణుల బృందం (ఐజిఇ) చేసిన సిఫార్సులు




**(1) 2014-15 సంవత్సరానికి వనరుల లోటు**

2014-15 సంవత్సరానికి యూనియన్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.3979.50 కోట్లు పోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న వనరుల లోటు రూ.19,015.48 కోట్లు. ఇందులో ఇప్పటికే చేసిన ఖర్చులు, నిధుల కొరత వల్ల విధిగా చెల్లించాల్సినా వాయిదా వేసిన వ్యయం కలిపి ఉన్నాయి.

ఈ మొత్తం లోటులో రూ.10,335.07 కోట్లు స్పష్టంగా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం యూనియన్ ప్రభుత్వం భర్తీ చేయాల్సిన లోటు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, పార్లమెంటులో ప్రధానమంత్రి ఇచ్చిన నిబద్ధ హామీకి అనుగుణంగా ఈ మొత్తాన్ని (రూ.10,335.07 కోట్లు) యూనియన్ ప్రభుత్వం పూర్తిగా భర్తీ చేయాలి.

మిగిలిన రూ.8,660.41 కోట్లు వనరుల లోటు అయినా, కొత్త పథకాలు, ప్రమాణీకరించని వ్యయం కింద పరిగణించి, భారత ప్రభుత్వం తన విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చు.

**(2) చట్టంలోని అసంబద్ధతల వల్ల కలిగిన నష్టం**

చట్టంలోని అసంబద్ధత వల్ల ఆంధ్రప్రదేశ్‌కనికర ఆదాయంలో రూ.3,820.36 కోట్ల (నికర ఆదాయం) నష్టం వచ్చింది.

విభజన చట్టం, 2014 ప్రకారం.. ఆస్తి పన్నులు మినహాయించి, మిగతా పన్నుల బకాయిలు ఏ రాష్ట్రంలో ఆ సంస్థ కార్యాలయం ఉంటే ఆ రాష్ట్రానికి చెందుతాయి. కానీ అదనంగా పన్నులు వసూలు చేసి ఉంటే, వాటి చెల్లింపు (రీఫండ్) బాధ్యతను రెండు రాష్ట్రాలు జనాభా ప్రాతిపదికన పంచుకోవాలి. హైదరాబాదు నగరం అతి పెద్ద వాణిజ్య నగరం కావటంతో, అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వాణిజ్య సంస్థలు దాదాపు అన్నింటి కేంద్ర కార్యాలయాలు హైదరాబాద్‌లోనే ఏర్పాటయ్యాయి. దీంతో, సంస్థ కార్యాలయం ఉన్న రాష్ట్రం బకాయిలు వసూలు చేసుకోవటం, తిరిగి చెల్లింపుల భారాన్ని మాత్రం రెండు రాష్ట్రాలు పంచుకోవటం.. అనే సూత్రం మహానగరమయిన హైదరాబాదుని పొందిన తెలంగాణకి లాభాన్ని చేకూర్చగా, ఆంధ్రప్రదేశ్‌కి నష్టాన్ని కలిగించింది. అలాకాక పన్నుల బకాయిల్ని, తిరిగి చెల్లింపుల భారాన్ని రెండు రాష్ట్రాలూ జనాభా దామాషాలో పంచుకుంటే, ఆంధ్రప్రదేశ్‌కి అదనంగా రూ.3,820.36 కోట్లు రావాలి.

ఇది పార్లమెంటు ఆమోదించిన చట్టంలోని నిబంధనల్లోని తప్పిదం వల్ల కలిగిన నష్టం కాబట్టి, అవసరమైతే ఒకసారి తనిఖీ చేసుకుని, ఈ మొత్తాన్ని (రూ.3,820.36 కోట్లు) పూర్తి స్థాయిలో యూనియన్ ప్రభుత్వమే భర్తీ చేయాలి.

**(3) కేంద్ర ప్రాయోజిత పథకాలు (సిఎస్ఎస్)లో కేంద్ర నిధుల వాటా 90 శాతానికి బదులుగా ప్రత్యేక సాయం**

సిఎస్ఎస్‌లో కేంద్ర నిధుల వాటా 90 శాతానికి బదులుగా రూ.16,447 కోట్లు యూనియన్ ప్రభుత్వం రాష్ట్రానికి చెల్లించాల్సి ఉంది. ఈ ప్రత్యేక సాయాన్ని అందించటానికి ఇఎపి (విదేశీ తోడ్పాటు ప్రాజెక్టుల) పద్ధతి ఏ మాత్రం సరిపోదు. దీని ద్వారా ఇప్పటిదాకా అరకొర నిధులే విడుదలయ్యాయి.

కాబట్టి, ఇతర మార్గాల ద్వారా సాయం అందించాలి. రాష్ట్రాన్ని పెండింగ్ ఇఎపి రుణాలు, ప్రత్యేక అభివృద్ధి రుణాలు, యూనియన్ ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ సంస్థలకు ఉన్న ఇతర రుణాల చెల్లింపులకు అనుమతించటం, గ్రాంట్‌కు బదులుగా నాబార్డ్, హడ్కో తదితర దేశీయ రుణదాతల నుంచి అప్పులు తీసుకోవటానికి అనుమతించటం, తిరిగి చెల్లింపుల బాధ్యతను యూనియన్ ప్రభుత్వమే తీసుకుంటుంది కాబట్టి రాష్ట్ర ఎఫ్ఆర్‌బిఎం పరిమితి నుంచి ఈ మొత్తాన్ని

మినహాయించటం, ఆంధ్రప్రదేశ్ సహాయ బాండ్లను స్వల్ప, మధ్యకాల వ్యవధికి విడుదల చేయటం- వంటి మార్గాల ద్వారా యూనియన్ ప్రత్యేక సాయాన్ని (రూ.16,447 కోట్లు) అందించాలి.

**(4) పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయటానికి అవసరమైన సాయం**

పోలవరం ప్రాజెక్టు మొదటి దశను (41.15 మీ. ఎత్తు) 2019 నాటికి పూర్తి చేయటానికి, ఇప్పటిదాకా చేసిన వ్యయం తాలూకు పెండింగ్‌లో ఉన్న రూ.3342.40 కోట్ల బిల్లులతో కలిపి రూ.8,711.19 కోట్లు అవసరం. రెండవ దశను (45.72 మీ. ఎత్తు) పూర్తి చేయటానికి 2019-20లో రూ.27,494 కోట్లు యూనియన్ ప్రభుత్వ సాయంగా అందాలి. రెండవదశలో 90 శాతంపైగా వ్యయం భూసేకరణ, పునరావాసానికి సంబంధించినదే.

నవరించిన ప్రాజెక్టు వ్యయ అంచనాలను నిబంధనలకనుగుణంగా యూనియన్ ప్రభుత్వం ఆమోదించవచ్చు.

పోలవరం విషయంలో యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు చక్కని సమన్వయంతో వ్యవహరించాయి. ప్రాజెక్టు పురోగతి ఆకట్టుకునేలా ఉంది. ప్రాజెక్టు రెండు దశలనూ నిర్ణీత కాలవ్యవధితో పూర్తి చేసే విధంగా తగినన్ని నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి.

**(5) వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహాయం**

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.24,350 కోట్ల అంచనాతో ప్రతిపాదనల్ని రూపొందించింది. జనాభా, ద్రవ్యోల్బణాలకనుగుణంగా ఇది దాదాపుగా బుందేల్‌ఖండ్ ప్యాకేజీతో సమానంగా ఉంది.

యూనియన్ ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఇప్పటిదాకా గత నాలుగున్నరేళ్ల కాలానికి రూ.1,050 కోట్లను విడుదల చేసింది. రానున్న సంవత్సరాలలో రూ.700 కోట్లు చెల్లించనుంది. యూనియన్ ఇచ్చిన నిర్దిష్ట హామీకి, వెనుకబడిన రాయలసీమ, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాల అవసరాలకు - జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున చేస్తున్న సాయానికి మధ్య చాలా అంతరం ఉంది.

ఐదేళ్ల గడువులో నిర్ణీత కాల పద్ధతిలో రూ.24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు అమలు చేయటానికి యూనియన్ ప్రభుత్వం ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలి.

**(6) దుగ్గరాజపట్నం మరియు/లేదా ప్రత్యామ్నాయ పోర్టు నిర్మాణం**

దుగ్గరాజపట్నం వద్ద నౌకాశ్రయం అభివృద్ధికి రూ.7,988 కోట్లు ఖర్చవుతుందని తాత్కాలికంగా అంచనా వేశారు. అయితే, ఆ ప్రాంతంలో పోర్టు ఏర్పాటు ఆచరణలో నష్టదాయకమని యూనియన్ ప్రభుత్వం తేల్చింది. ప్రత్యామ్నాయంగా మరో ప్రాంతాన్ని సూచించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

సాధ్యాసాధ్యాల విషయాన్ని యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు తేల్చుకుని పోర్టు ఏర్పాటుకు ఆచరణరీత్యా సరైన ప్రాంతమేదో త్వరగా నిర్ధారించి, ఏమాత్రం ఆలస్యం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన పోర్టు అభివృద్ధిని అమలు చేయాలి, లేదా అందుకు సమానమైన ఇతర మౌలిక సదుపాయాల్ని రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు కల్పించాలి.

**(7) జాతీయ ప్రాధాన్యత గల పదకొండు సంస్థలను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయటం**

రూ.12,746.38 కోట్ల మేర ఉన్న మొత్తం ప్రాజెక్టులో కేవలం 845.42 కోట్లను, అంటే 6.63 శాతాన్ని మాత్రమే యూనియన్ ప్రభుత్వం ఇప్పటిదాకా విడుదల చేసింది. 93 శాతం ఇంకా ఖర్చుపెట్టాల్సి ఉంది. విద్య, వైద్య ఇలా దాదాపు అన్ని సంస్థలూ తాత్కాలిక ప్రాంగణాల్లో పనిచేస్తున్నాయి.

మిగిలిన నిధుల్ని విడుదల చేసి అన్ని సంస్థలనూ 2024లోగా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి.

**(8) ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతులు, రవాణా అనుసంధానత, పెట్టుబడుల ప్రాజెక్టులు**

పదమూడో షెడ్యూల్‌లోని మౌలిక వసతుల ప్రాజెక్టులను సమీక్షిస్తే.. ఐదు ప్రాజెక్టులు అమలు కాలేదని, మూడు అమలు తొలి దశలో ఉన్నాయని తేలింది. వీటిల్లో.. పెట్రో కెమికల్ కాంప్లెక్స్, మెట్రో రైలు ప్రాజెక్టులు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ (విసిఐసి), రాజధాని ప్రాంతానికి వేగవంతమైన రైలు, రోడ్డు రవాణా సంధానత, అంతర్జాతీయ విమానాశ్రయాలు కీలకం. పరిశ్రమలు, సేవల రంగాల్లో తక్కువ ఉద్యోగావకాశాలున్న ఆంధ్రప్రదేశ్‌లో.. ఈ ప్రాజెక్టులు ఆర్థిక కలాపాలకు ఉద్దీపననిచ్చి, పెట్టుబడులను పెంచుతాయి. పరిశ్రమలు, ఉద్యోగావకాశాలకు ఊపునిస్తాయి. కాబట్టి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను హెచ్చించే ఈ ప్రాజెక్టులకు భారత ప్రభుత్వం ఉదారంగా తోడ్పాటునందించాలి.

**(9) ప్రభుత్వ మౌలిక వసతులు, రాజధాని ప్రాంతం అభివృద్ధికి సాయం**

ఇప్పటిదాకా రాజధాని అభివృద్ధికి రూ.1,500 కోట్లను యూనియన్ ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రం రూ.1,632.48 కోట్లకు వినియోగ ధృవపత్రాల (యు.సిలు)ను సమర్పించింది. ఈ యు.సిల ఆధారంగానే రూ.666 కోట్లను

వెంటనే, రూ. 334 కోట్లను 2019-20లో విడుదల చేయాలని యూనియన్ ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేసింది.

ఇవికాక వేరేగా, విజయవాడ, గుంటూరు నగరాల్లోని భూగర్భ, వరద నీటి డ్రైనేజి కోసం రూ. 1,000 కోట్లను విడుదల చేశారు. ఇప్పటికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 229.65 కోట్ల మేరకు యు.సిలను సమర్పించింది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని సెక్షన్ 94 (3)ని యూనియన్ ప్రభుత్వం ఉదారంగా పరిగణలోకి తీసుకోవాలి. ప్రభుత్వ కాంప్లెక్స్‌కు అదనంగా, రహదారులు, వరద నీటి డ్రైనేజి, వరద నివారణ, పారిశుద్ధ్యం, మురుగు పారుదల, మంచినీరు, వేగవంతమైన రవాణా అనుసంధానత, మాస్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ మౌలిక వసతుల్ని కూడా 'ఇతర ముఖ్యావసర మౌలిక సదుపాయాలు'గా పరిగణించాలి.

అమరావతి అభివృద్ధికి సంబంధించిన అన్ని ప్రాజెక్టులూ - నీతి ఆయోగ్/ యూనియన్ ప్రభుత్వానికి రాష్ట్రం సమర్పించిన డిపిఆర్‌లు, ఇంకా రూపుదిద్దుకునే దశలో ఉన్నవి కూడా - నగరాన్ని ప్రధాన గ్రీన్ ఫీల్డ్ సిటీగా అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో, అవసరమైన పౌర వసతులతో ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు.. పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఇతర ముఖ్యావసర మౌలిక వసతుల్ని కూడా ఎపిఆర్ఎ, 2014లోని సెక్షన్ 94 (3) పరిధిలోకి వచ్చే ప్రాజెక్టులుగా పరిగణించాలి.

ఈ నేపథ్యంలో, 'ముఖ్యావసర సదుపాయాలు', పైన పేర్కొన్న అంశాల పరిధిలోని 'ఇతర ముఖ్యావసర మౌలిక వసతులు'కు సంబంధించిన ప్రాజెక్టులను గుర్తించేందుకు, డిపిఆర్‌లలో పేర్కొన్న అంచనా వ్యయాల్ని సమీక్షించేందుకు, ఈ అంశాలకు కావలసిన వనరుల్ని అంచనా వేసేందుకు పట్టణ ప్రణాళిక, అభివృద్ధి నిపుణులతో కూడిన కమిటీని యూనియన్ ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. ఆ అంచనాల ఆధారంగా, రాష్ట్రానికి కేంద్రం సహాయాన్ని అందించాలి.

అటవీ భూమి (2087.09 హెక్టార్లు) బదిలీని భారత ప్రభుత్వం వేగవంతం చేసి, గ్రేహౌండ్ శిక్షణా కేంద్రానికి ఆమోదించిన ప్రాజెక్టు వ్యయం రూ. 219.16 కోట్లను విడుదల చేయాలి.

**(10) ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులపై పన్ను రాయితీలు, ఇతర రాయితీలు**

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన అన్ని హామీల్లో, పారిశ్రామిక, ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు ఉద్దేశించిన పన్ను రాయితీల అంశం అత్యంత సంక్లిష్టమైనది, వివాదాస్పదమైనది. సెక్షన్ 94(1) కింద యూనియన్ ప్రభుత్వ నిర్దిష్ట హామీ అయితే సుస్పష్టం. అంతకంటే ముఖ్యమైనది, ప్రధానమంత్రి హామీలోని 1వ పేరా (ప్రత్యేక తరగతి హోదా- స్పెషల్ కేటగిరీ స్టేటస్), 2వ పేరా (పన్ను రాయితీలు). ఈ రెండు పేరాలలో చెప్పినది, బహిరంగంగా చెప్పిన అనేక హామీలు పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు అంతకుముందు అనేక ప్రత్యేక హోదా రాష్ట్రాలకు ఇచ్చిన, 2020 వరకు ఈశాన్య రాష్ట్రాలకు యూనియన్ కేబినెట్ మార్చి 21, 2018న ఆమోదించిన మినహాయింపుల తరహాలోనే పన్ను మినహాయింపుల్ని ఇస్తామన్న విస్పష్ట కమిట్‌మెంట్‌ను ఇచ్చాయి.

యూనియన్ ప్రభుత్వ దృష్టిలో.. ప్రత్యేక తరగతి హోదా, పన్ను రాయితీలు ఒకదానితో ఒకటి సంబంధం లేనివి. అయితే, యూనియన్ పూర్తి ఆదాయపు పన్ను, ప్రత్యేక పన్ను రాయితీలు సహా పెట్టుబడులపై ప్రత్యేక పన్ను మినహాయింపుల్ని ఇచ్చిన అన్ని రాష్ట్రాలూ ప్రత్యేక తరగతి హోదా రాష్ట్రాలే. ఎన్ఇఐడిఎస్ పన్ను రాయితీలు కూడా ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాలకే గ్రాంట్ అయ్యాయి.

పన్ను రాయితీల సంక్లిష్ట అంశాన్ని పరిష్కరించటానికి పలు మార్గాలను పరిగణలోకి తీసుకోవచ్చు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, రాయితీలను ఆ ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేయటం అందులో ఒక ఆచరణయుక్తమైన మార్గం. చాలా ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలకు ఇచ్చినట్లు పూర్తి పన్ను మినహాయింపుల్ని కాకుండా.. ఇప్పుడిస్తున్న రాయితీలకంటే గణనీయంగా పెంచి పన్ను మినహాయింపు ప్రయోజనాల్ని మొత్తం ఆంధ్రప్రదేశ్‌కు విస్తరింపచేయటం రెండో పద్ధతి. మూడోది, ఇతర రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగిలిన భారతదేశంలో గుర్తించిన వెనుకబడిన ప్రాంతాలకు కూడా పూర్తి పన్ను రాయితీ ప్రయోజనాల్ని అందించటం.

ఇదేసమయంలో యూనియన్ ప్రభుత్వం అదనంగా ఆంధ్రప్రదేశ్‌లో 100 శాతం ఆర్థిక సాయంతో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధికనుగుణంగా చేపట్టాలి. సహజ వనరులు, స్థానిక నైపుణ్యాలు, మార్కెట్ సామర్థ్యం ఆధారం చేసుకుని.. పారిశ్రామిక మౌలిక వసతుల ఆధునీకరణ పథకం (ఐఐయుఎస్), మెగా ఫుడ్ పార్క్ పథకం, సమీకృత మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఐఐడి) పథకం వంటి సముదాయ పథకాల తరహాలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టవచ్చు. వీటివల్ల గణనీయంగా ఉపాధికల్పన జరుగుతుంది. ✧

(పూర్తి వివరాలకు @ www.fdrindia.org)

# ఫెడరలిజాన్ని విస్తరించేందుకు నిర్మాణాత్మక ఉద్యమ కృషి

గణతంత్ర వ్యవస్థ అంటే ఏమిటో కూడా స్కూలు పిల్లలకు తెలియని పాఠశాల విద్యను మన దేశంలో అమలు చేస్తూ రాజ్యాంగానికి, దేశ భవిష్యత్తుకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రజలకు సరైన విద్య, ఆరోగ్యం అందించేందుకు, స్థానికంగా ఎక్కడికక్కడ ప్రజలకు రోజువారీ పనులు చేసుకునేందుకు అధికారాలు ఢిల్లీ నుంచి గల్లీకి రావాలని, ఈ దిశగా అధికారాన్ని వికేంద్రీకరించి ఫెడరలిజాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలుగు రాష్ట్రాల్లో, జాతీయస్థాయిలో కూడా లోక్‌సత్తా ఉద్యమస్థాయిలో నిర్మాణాత్మక కృషి చేస్తోందన్నారు. విజయనగరంలో ఏం జరగాలో ప్రధానమంత్రి చెప్పటం, ఆంధ్రప్రదేశ్‌లో విధానాలు ఎలా ఉండాలో ఢిల్లీ శాసించటం అధ్వాన్న ప్రజాస్వామ్యానికి సంకేతమన్నారు. నెల్లిమర్లలో సమస్యల్ని అమరావతిలోని ముఖ్యమంత్రి పరిష్కరిస్తాననటం హాస్యాస్పదమన్నారు. అధికారాల్ని కేంద్రం నుంచి రాష్ట్రానికి, రాష్ట్రం నుంచి స్థానిక ప్రభుత్వానికి బదలాయించాలన్నారు. దేశ 70వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని పార్టీ



కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగమే లేకపోతే, ఈ దేశంలోని సామాన్య, అణగారిన వర్గాల మీద దాడులు కొనసాగుతూ ఉండేవని, అందుకే రాజ్యాంగాన్ని తమకు నచ్చినట్లు అమలు చేస్తూ దెబ్బతీయాలని చూస్తున్న పెత్తందారీ పాలక వర్గాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, నాయుడు, పీఎల్ఎన్, రాజు, పతివాడ చంద్రరావు, పోలుపర్తి అప్పారావు, శిమ్మ శ్రీను, కాళ్ల శ్రీను, సురేష్, చిన్నారావు, భాస్కర్, బోర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల కోసం మరోసారి సాధికార సర్వే చేయండి

జిల్లాలో గిరిజనులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందటం లేదని, వారి కోసం మరోమారు సాధికార సర్వేను నిర్వహించాలని బాబ్జీ కోరారు. విజయనగరం మెప్మా ప్రాజెక్టు అధికారి డి.అనిల్ కుమార్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞాపన పత్రం అందజేశారు. చంద్రన్న బీమా క్లెయిములను వెంటనే పరిష్కరించాలని కోరారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ పూర్తిగా ముఖ్యమంత్రి చంద్రబాబు జేబు సంస్థగా మారిపోయిందని, స్వయంసహాయక సంఘాలను ప్రలోభపెట్టి సభలకు తరలిస్తున్నారని బాబ్జీ అసంతృప్తి వ్యక్తం చేశారు.



# అభివృద్ధికి అనువైనది గుంతకల్ డివిజన్



ఏపీకి రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయాలని, ఈ క్రమంలో గుంతకల్‌ను విస్తరించాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్.రామమోహన్ రైల్వే మంత్రి రాజన్ గోహెన్‌ను కోరారు. గుంతకల్ ప్రాంతంలో 9,000 ఎకరాల సువిశాల భూమి ఉందని, దీన్ని సద్వినియోగం చేస్తే ప్రత్యక్షంగా వేలమందికి, పరోక్షంగా 2లక్షల మందికి ఉపాధి ప్రయోజనం లభిస్తుందన్నారు. దక్షిణాదిన అధికాదాయాన్నిస్తున్న గుంతకల్ డివిజన్ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ బాధ్యతన్నారు. దీనివల్ల రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమకు లబ్ధి చేకూరుతుందన్నారు. లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.నాగార్జున, కోశాధికారి ఖలీల్, యువసత్తా అధ్యక్షుడు మధు, గోపాల్, ఖాదర్ బాషా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ 2019 ఎన్నికల ముందు రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఇలా ఉంది. విభజనను ఎదుర్కోవడానికి 'సమైక్య ఆంధ్ర ఉద్యమం' నడపడం ఒక్కటే పరిష్కారం అని నమ్మిన ఆంధ్రప్రదేశ్ ఒకవైపు, ఉద్యమ విజయాన్ని, మరోసారి ఎన్నికల్లో తనకు అనుకూలంగా మలచుకున్న తెలంగాణ మరొకవైపు ఉన్నాయి. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అప్పట్లో ఈ సమైక్య ఆంధ్ర ఉద్యమాన్ని నడిపించిన ఉద్యోగ సంఘ నాయకులు కాలక్రమంలో విశ్వసనీయత కోల్పోగా, 2019కి గాను తెలంగాణలో, మరో ఐదేళ్లు మీరే అధికారంలో ఉండమని టీఆర్ఎస్‌కు అనుకూలంగా అక్కడి ప్రజలు తీర్పు ఇచ్చారు. అయితే సమైక్య ఆంధ్ర ఉద్యమ నాయకులు గడచిన నాలుగున్నర ఏళ్లలో - అప్పట్లో ఎందుకు తాము విభజనను వ్యతిరేకించామని ఒక డాక్యుమెంట్‌నూ విడుదల చేయలేకపోయారు. కనీసం ఇప్పటికైనా ఏపీ ప్రజల కోసం, తమ ప్రాంతం కోసం ప్రభుత్వం, రాజకీయ పార్టీలు ఏమి చేయాలి అనే దిశలో పౌర సమాజాలను కలుపుకుని, ప్రాంతీయ సమావేశాలను నిర్వహించలేకపోయారు. విభజన చట్టం అమలు మీద నిరంతర నిఘాతో దాన్ని సమీక్షిస్తూ రాజకీయాలకు ప్రభుత్వాలకు సమాంతరంగా ఒక ఒత్తిడి బృందాన్ని (ప్రెషర్ గ్రూప్)ని నిర్మించలేకపోయారు. ఈ పరిస్థితికి భిన్నంగా తెలంగాణ ప్రభుత్వంలో ఉన్న టీఆర్ఎస్ విభజన లక్ష్యంగా ఒక దశాబ్ద కాలంపైగా ప్రజలు, ప్రాంతం, ప్రభుత్వం.. అనే కోణంలో విస్తృతమైన మేధోమథనం చేసి ఉంది. అలాంటిది ఇటు ఆంధ్ర ఉద్యమకాలంలో జరగలేదు. రెండు ప్రాంతాల మధ్య తేడా విభజన జరిగిన మొదటి ఏడాదే స్పష్టమైంది. ఇప్పటివరకు ఏపీలో 'థింక్ ట్యాంక్' వంటివి నామమాత్రంగా కూడా లేవు అన్నది గుర్తించి తీరాలి.

- జాన్సన్ చోరగుడి, అభివృద్ధి-సామాజిక విశ్లేషకులు

★ జనగాం మండలంలోని పెంబర్తి గ్రామంలో ఇద్దరు పంచాయతీ ఎన్నికల అభ్యర్థుల ఖర్చు మొత్తం రూ.1.80 కోట్లు. 3394 ఓటర్లు ఉన్న ఈ పంచాయతీలో పోటీ నుంచి తప్పుకుంటే రూ.2 కోట్లు ఇచ్చేందుకు ఓ అభ్యర్థి ప్రతిపాదించినా ఎవరూ తప్పుకోలేదు. రెండు పార్టీల మద్దతు ఉన్న ఓ ఇద్దరు ప్రతి కుటుంబానికీ నోట్లు పంచిపెట్టారు. దీంతో కొన్ని కుటుంబాలకు రూ.పాతికవేలకుపైగా అందినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పది రోజుల నుంచి ఆ ఇద్దరు అభ్యర్థులు గ్రామంలో రోజుకు రూ.లక్షల్లో ఖర్చు పెట్టి మద్యం, మాంసంతో విందు ఇచ్చారు. యాదాద్రి చుట్టూ విస్తరించిన పంచాయతీల్లో ఓటుకు తక్కువలో తక్కువగా రూ.5వేలు పంపిణీ చేశారు. యాదగిరిగుట్ట మండలం సైదాపూర్‌లో సర్పంచి స్థానానికి పోటీ చేసిన ఒకరు రూ.50లక్షలకుపైగా వ్యయం చేసినట్లు అంచనాలు ఉన్నాయి. 1191 ఓట్లు ఉన్న ఈ పంచాయతీలో ఒక కుటుంబానికి రూ.10,000 కన్నా తక్కువ రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వార్డులకు పోటీ చేసిన వారు కూడా రూ.5 లక్షలకనుంచి రూ.10 లక్షలు ఖర్చు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఇదే మండలంలోని మల్లాపూర్‌లోనూ కుటుంబానికి రూ.15,000 వరకు అందాయి. మద్యం సీసా అదనం. వార్డు సభ్యుల్లో కొందరు వారికి కేటాయించిన గుర్తులకు నమూనాలు తయారుచేసి వాటిలో నోట్ల కట్టలు పెట్టి పంచారని పలువురు అంటున్నారు. అయితే ఈ నోట్లస్వామ్యం మారుమూల గ్రామాల్లో తక్కువగా కనిపించింది. మొత్తంగా ఆరేళ్ల అనంతరం, తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓటు కోసం పట్టణ, నగరవాసులు పెద్దఎత్తున గ్రామాలకు తరలివచ్చారు.

- ఓ రిపోర్టర్

★ పరిపాలనలో మార్పు రావాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా అధికార వికేంద్రీకరణతోనే సాధ్యం.

- బీఎస్ రాములు, తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్

(కర్టెసీ: ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ)

# రిజర్వు స్థలాలను అన్యాక్రాంతం చేసే ప్రయత్నంపై లోక్‌సత్తా ఫిర్యాదు

**సు**ప్రీంకోర్టు ఆదేశాల మేరకు పట్టణ ప్రాంత రిజర్వు స్థలాలను ఆటల మైదానం, పార్కులు, పర్యావరణానికి సంబంధించి మాత్రమే ఉపయోగించుకోవాలని, ఇతరత్రా నిర్మాణాలకు, లీజులకు వినియోగించుకోరాదని, అయితే ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ రాయదుర్గం మునిసిపాలిటీ పరిధిలోని రిజర్వు స్థలాన్ని లీజుకిచ్చేందుకు పాలకవర్గం ప్రయత్నిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం ఇంఛార్జి వెంకటరమణబాబు అన్నారు. భంభంస్వామి ఆశ్రమం వద్ద బలిజ కళ్యాణమంటపం ఎదురుగా ఓపెన్ రిజర్వు సైట్‌ను టీడీపీ నేతకు కట్టపెట్టేందుకు పావులు కదిపారన్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్‌తో కలిసి టీడీపీ నాయకులు, రియల్ ఎస్టేట్ దందాలో ఆరితేరిన కౌన్సిలర్లు కుమ్మక్కయి లీజు అంశాన్ని కౌన్సిల్‌లో పొందుపరిచినట్లు సమాచారం అందిందని అన్నారు. లీజు కోరిన వ్యక్తి టీడీపీ పట్టణ అధ్యక్షుడని అన్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్‌తోపాటు కలెక్టర్‌కి కూడా ఫిర్యాదు



చేశామన్నారు. ప్రజాప్రయోజనాల కోసం రిజర్వుస్థలాలను కాపాడాల్సిన బాధ్యత మునిసిపల్ పాలకులు, అధికారుల మీద ఉంటుందన్నారు. కానీ వారే అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నించటం తగదన్నారు. కాగా, కౌన్సిల్ సిఫార్సు మేరకు అజెండాలో అంశాన్ని ఉంచినప్పటికీ, రిజర్వు స్థలం జీవో మేరకు లీజుకు ఇచ్చేందుకు నిబంధనలు అంగీకరించవని స్పష్టం చేసి తిరస్కరణను రికార్డు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ తెలిపారు.

# లోక్‌సత్తా ఓటరు చైతన్య కార్యక్రమాలు, పోస్టాఫీసుల్ని శాశ్వత ఓటు నమోదు కేంద్రాలుగా చేయాలని డిమాండ్

**ప**ద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదవ్వాలని, ఓటు ప్రాధాన్యతను గుర్తించి సరైన అభ్యర్థికి, పార్టీకి వేయాలని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం ఇంఛార్జి వెంకటరమణబాబు విజ్ఞప్తి చేశారు. యువతలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పోస్టాఫీసుల్ని ఓటరు నమోదుకు శాశ్వత నోడల్ కేంద్రాలుగా ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు.



# వసతి భవనాన్ని వాడుకలోకి తీసుకురండి






**జి**ల్లా కేంద్ర ఆస్పత్రిలో లోక్‌సత్తా పార్టీ సూచన మేరకు 40.80 లక్షల నిధులతో నిర్మించిన రోగుల సహాయకుల వసతి భవనాన్ని వెంటనే వాడుకలోకి తేవాలని లోక్‌సత్తా పార్టీ విజయనగరం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం డిమాండ్ చేశారు. ఆస్పత్రి నిర్వహణలో నిర్లక్ష్యానికి నిరసనగా ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి నూతన భవనం వద్ద ప్రదర్శన చేశారు. రోగుల సహాయకుల కోసం వసతి భవనం, ఆధునిక సౌకర్యాలతో నూతన మార్చురీ నిర్మాణం, కేంద్ర ఆస్పత్రి ప్రారంభంలో ఉన్న మార్చురీ తొలగింపు కోసం లోక్‌సత్తా నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. ఆస్పత్రి నిర్వహణ రోగుల చుట్టూ తిరగాలి తప్ప ఉద్యోగులు, నాయకుల చుట్టూ కాదన్నారు. అనంతరం రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా॥ గౌరీ శంకర్, డా॥ సత్యాశ్రీనివాస్‌లను కలిసి పార్టీ నేతలు వినతిపత్రం అందజేశారు. లోక్‌సత్తా సీనియర్ నేతలతోపాటు భీంపల్లి భాస్కరుడు, సూరిబాబు, ఆదియ్యా, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా సహచరులారా ! (మనసులో మాట)

- ఎ. అన్నపూర్ణ, కేలిఫోర్నియా




**వచ్చిపోయే లాంతర్ల వెలుతురుకు పరిమితం కాకుండా దూర నక్షత్ర కాంతుల బాటలో సాగిపోవాలని లోక్‌సత్తాకి లోగోగా నక్షత్రాన్ని రూపొందించారు. లోక్‌సత్తా ప్రయత్నాన్ని చూసి ఇదేదో ఇప్పట్లో జరిగే పని కాదన్న జోకుల్ని అనేకం విన్నాం. కానీ సుదూర తీరంలోని చందమామని, గ్రహాల్ని, నక్షత్రాల్ని అలవోకగా చేరుకోవటం ఇప్పుడు మొదలైంది. 'ఇస్రో' శాస్త్రవేత్తల కృషితో అంతరిక్షం గురించి సామాన్యులు కూడా మాట్లాడుకుంటున్నారు. ఏదోకరోజు వేరే గ్రహానికి కూడా వెళ్లగలిగితేనే మానవజాతి మనుగడ సాధ్యమని స్టీఫెన్ హాకింగ్ వంటి శాస్త్రవేత్తలు కూడా చెప్పారు. ఈవేళ దాదాపు ప్రతిరోజూ వార్తాపత్రికల్లో, ఇతర మాధ్యమాల్లో కూడా పాలపుంతలు, నక్షత్ర మండలాల గురించిన వార్తలు రిపోర్టు అవుతున్నాయి. గ్రహాంతర నివాసాల మీద బిలియనీర్లు పెట్టుబడులు పెడుతుండటమే అంతరిక్షం దిశగా పెద్ద మార్పు మొదలవుతోందనటానికి, అసాధ్యం సుసాధ్యమవుతోందనటానికి బండ గుర్తు! ఇదేరీతిలో దూర నక్షత్ర కాంతుల సాగే మంచి రాజకీయాన్ని కూడా మనం సాకారం చేసుకోగలం. సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసినంత తేలిగ్గా మానవాళి ఆలోచనను మార్చి వ్యవస్థను నిర్మించటం సాధ్యం కాకపోవచ్చు.. కానీ అసాధ్యం మాత్రం కాదు. ఇందుకు గణనీయమైన స్థాయిలో పరిస్థితులు.. ఉన్నకొద్దీ అనుకూలంగా మారుతున్నాయి. పాలకులు, ఇతర ప్రధాన పార్టీల నాయకులు కీలక సమయంలో గొప్ప అవకాశాల్ని జారవిడవటం వల్ల, కొన్ని అవరోధాలు తలెత్తుతున్నాయి. అయినా కూడా స్థానికంగా ఎదగటానికి లోక్‌సత్తాకు అనుకూలమైన వాతావరణం నెలకొంటోంది.**

**మిత్రులకు, గౌరవనీయ లోక్‌సత్తా పార్టీ సహచరులకు,**

జనవరి 6, 7 తేదీలలో విజయవాడలో లోక్‌సత్తా పార్టీ సమావేశాలకు రమ్మని మీరు పంపిన సందేశాన్ని అమెరికాలో అందుకున్నాం. ధన్యవాదాలు. ఆ తర్వాత, సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని తెలుసుకున్నాం. గత ఎన్నికల తర్వాత విరామం తీసుకున్న సమయంలో కూడా రాష్ట్ర నాయకులు, సభ్యులు, కార్యకర్తలు తమ పరిధిలో కలాపాలు కొనసాగిస్తూనే ఉన్నారు. పార్టీ స్థాపకులు జయప్రకాష్ నారాయణ్ గారైతే నిర్విరామంగా పనిచేస్తూ లోక్‌సత్తా పరిష్కారాల్ని తెలుగు రాష్ట్రాల, దేశ ప్రజల ముందూ, రాజకీయ పార్టీల ముందూ ఉంచుతూనే ఉన్నారు. అయితే భవిష్యత్తులో ఎన్నికలపరంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో తెలియక సభ్యులు, కార్యకర్తలు, ప్రజలు కొంత అయోమయస్థితిలో, నిర్లిప్తతలో ఉన్నమాట వాస్తవం. ఈ నిర్లిప్తతను హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర పార్టీ సమావేశాలు, ఆ తర్వాత విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ సమావేశాలు చెదరగొట్టాయి. 2019 నుంచి 2024 వరకూ ఐదు సంవత్సరాలపాటు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవటానికి నిర్దిష్ట పునాదిని వేశాయి.

తెలంగాణలో నిజమైన రాజకీయ కృషి జరగాల్సి ఉందని, ఏపీలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను ఉపయోగించుకుని ఒక ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లటంతోపాటు ఫెడరలిజాన్ని బలోపేతం చేసేలా ప్రాంతీయ పార్టీల సహకారంతో పనిచేయాలని జేపీ దిశానిర్దేశం చేశారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు యూనియన్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరు, పొరుగు రాష్ట్రాలకు నష్టం లేకుండా ఏపీ తన ప్రయోజనాలను సాధించుకోవటానికి ఏం చేయాలి, ఫెడరలిజాన్ని పటిష్టం చేయటం తదితర ముఖ్యాంశాలతో లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డిఆర్) చొరవతో స్వతంత్ర నిపుణులు రూపొందించిన నివేదికను కూడా ఇదే సమయంలో

విజయవాడలో ఆవిష్కరించారు. అసలు ఏం జరుగుతుందో, ఏపీకి ఎన్ని నిధులు రావాలో అర్థంకాక.. అధికార క్రీడలో మునిగి వాస్తవాల ఆధారంగా కాక భావోద్రేకాలను రెచ్చగొట్టి తమను విభజించి లబ్ధి పొందుదామనుకుంటున్న పార్టీల తీరుతో ఏం చేయాలో తోచక, తమను ఎవరూ పట్టించుకోకుండా దగా చేశారన్న ఆక్రోశంతో ఉన్న ఐదున్నర కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో అనేకమందికి ఈ నివేదిక ఎంతో ఊరట కలిగించింది. తమకు న్యాయంగా రావాల్సిన నిధులెన్నో, వాటిని ఎలా సాధించుకోవాలో ఇప్పుడు వారికి స్పష్టత వచ్చింది. ఈ వివరాల్ని ఇంకా ప్రజల్లోకి చేర్చాల్సుంది. ఎంతో ఓపికతో సమాచారాన్ని సేకరించి విశ్లేషించటంతోపాటు, స్వతంత్ర వ్యక్తిత్వాలు, విశేష పాలనా, న్యాయ పరమైన నేపథ్యమున్న నిపుణుల్ని ఒకచోటికి చేర్చి, వారు వ్యక్తం చేసే భిన్నాభిప్రాయాలను సమన్వయం చేయటంలో జేపీ చేసిన కష్టాన్ని తెలుగు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఇందుకు లోక్‌సత్తా వేదికగా, వాహకంగా పనిచేయాలి.

నేను హైదరాబాద్ క్షేత్రంగా కూడా లోక్‌సత్తా పార్టీలో పనిచేసినా తాజాగా నాకు ఆహ్వానం ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చింది కాబట్టి పార్టీ పెద్దల నిర్ణయం మేరకు ప్రస్తుతానికి అక్కడి రాజకీయాలకే పరిమితమవుతాను. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సత్తా పార్టీ 2019 ఎన్నికల్లో పోటీ చేయవచ్చు, చేయకపోవచ్చు. కానీ పోటీకైతే సిద్ధమవ్వాలి. రాష్ట్రానికి వర్మగారి నేతృత్వంలో ఏర్పాటైన కొత్త రాష్ట్ర కమిటీ ఈమేరకు తీసుకున్న నిర్ణయం సరైనదనటంలో సందేహం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు మేధోపరమైన కృషి చేసి నివేదికను రూపొందించి, రాష్ట్ర - కేంద్ర ప్రభుత్వాల మధ్య సమస్య పరిష్కార మధ్యవర్తిత్వం చేయటమనే పార్టీలకతీతమైన కృషితోపాటు, పార్టీపరంగా కూడా రాజకీయ కృషిని రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో చేయాలి. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో ప్రచారం చేస్తూనే, కొన్ని ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో పోటీ దిశగా పునాదులు



వేసుకోవాలి. స్థానికంగా చిన్న చిన్న మార్పుల్ని సాధించటం చేయగలిగినా ప్రజలు మనల్ని అక్కున చేర్చుకుంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు చురుకైనవారు, దూరదృష్టి, భవిష్యత్తు పట్ల భరోసా కలవారు. తమ బిడ్డలు స్వచ్ఛమైన పాలనను చూడాలని, అనుభవించాలనీ కోరుకుంటున్నారు. మనకు ప్రభావం చూపగలిగే స్థాయిలో వారి సహాయ సహకారాలు అందుతాయని ప్రగాఢంగా నమ్ముతున్నాను. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీలు ఒకరిమీద మరొకరు బురదను చల్లుకోవడం, ప్రజల బాగు పట్టించుకోకపోవడం, కక్ష సాధింపు చర్యలతో కాలం గడిపేయడం, పెత్తనం చేయడం జరుగుతోంది. ప్రజలకు పనికివచ్చే విధానాలను అమలు చేయడం లేదు. ప్రజల అసంతృప్తిని, ఆవేదనను నిర్మూలించే ఆలోచనను పాలకులు, ప్రధాన పార్టీలు చేయడం లేదు. పాలనాధికారాలను తమ కుటుంబంలో వ్యక్తులకు అప్పగించాలన్న ధ్యాసలో మునిగిపోయారు. నిన్న మొన్నటి దాకా నెత్తికెత్తుకున్నవారు ఈరోజు ఫిరాయింపులకు సిద్ధమవుతున్నారు. నిన్న నేరస్తులు ఈవేళ కడిగిన ముత్యం. అంతేతప్ప అర్హుడైన మంచి వ్యక్తిని అధికారంలోకి రానీయడం లేదు. ప్రజలు కూడా లోతుగా పరిశీలించి సరైన రాజకీయాలను ఆహ్వానించాలి. శాశ్వత జీవనోపాధికి, భావి తరాలు ఎదగడానికి తగిన నిర్ణయాలు తీసుకోవాలి. నైపుణ్యంతోపాటు నాయకత్వ అర్హతలు కలిగి ఉన్నవారికి ప్రోత్సాహాన్నివ్వాలి, సంపాదన కోసమే పదవి అనే ధోరణి కలవారిని నిరాకరించాలి. ప్రజలకు ప్రయోజనం చేకూర్చే అంశాల ఆధారంగా రాజకీయాలను ఆహ్వానించటం మనకు ముఖ్యం తప్ప నేతల కులమతాలు, డబ్బు, గ్లామర్ కాదు.

ఈ అంశాలను ప్రజల్లోకి స్థానికంగా, నిలకడా ప్రజల్లోకి తీసుకెళ్తుంటే ప్రభుత్వం కచ్చితంగా కనిపిస్తుంది. ఇతర పార్టీలవారిని కదిలించే స్థాయి ప్రభావానికి లోక్‌సత్తావారు ఓటర్లను సమీకరించుకోవచ్చు. ఇందుకు మన వ్యవస్థాపకునితోపాటు స్థానికంగా ఉండే యువ స్వచ్ఛంద సేవకులను కూడా స్ఫూర్తిగా తీసుకోవచ్చు. ప్రభుత్వాధికారులైన యువత ప్రజాసేవతో ప్రజలకు చేరువవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. వీరిని ఆదర్శంగా తీసుకుని ఆదరణ పొందవచ్చు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసినా, ఇంకొంతకాలం వేచిచూసినా.. ఎన్నికలకు కావలసిన రాజకీయ కృషికి లోక్‌సత్తా పార్టీ ఇప్పుడు మనందరికీ మరో అవకాశాన్ని ఇచ్చింది. ఆ అవకాశాన్ని సొంతం చేసుకోండి. వీలుంటే

ఎన్నికలు, గెలుపు.. కానీ ఎన్నికలతో సంబంధం లేకుండానే (అంతకంటే ముఖ్యంగా కూడా) ప్రజల జీవితాల్ని బాగు చేసే రాజకీయం చేసి నాయకులుగా ఎదగాలి. గుర్తింపు పొందాలి. మనం ఏ లక్ష్యాలతో లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో చేరామో, అవే లక్ష్యాల సాధన పార్టీని బలోపేతం చేస్తాయని గుర్తుంచుకోవాలి.

వచ్చిపోయే లాంతర్ల వెలుతురుకు పరిమితం కాకుండా దూర నక్షత్ర కాంతుల బాటలో సాగిపోవాలని లోక్‌సత్తాకి లోగోగా నక్షత్రాన్ని రూపొందించారు. లోక్‌సత్తా ప్రయత్నాన్ని చూసి ఇదేదో ఇప్పట్లో జరిగే పని కాదన్న జోకుల్ని అనేకం విన్నాం. కానీ సుదూర తీరంలోని చందమామని, గ్రహాల్ని, నక్షత్రాల్ని అలవోకగా చేరుకోవటం ఇప్పుడు మొదలైంది. 'ఇస్రో' శాస్త్రవేత్తల కృషితో అంతరిక్షం గురించి సామాన్యులు కూడా మాట్లాడుకుంటున్నారు. ఏదోకరోజు వేరే గ్రహానికి కూడా వెళ్లగలిగితేనే మానవజాతి మనుగడ సాధ్యమని స్టీఫెన్ హాకింగ్ వంటి శాస్త్రవేత్తలు కూడా చెప్పారు. ఈవేళ దాదాపు ప్రతిరోజూ వార్తాపత్రికల్లో, ఇతర మాధ్యమాల్లో కూడా పాలపుంతలు, నక్షత్ర మండలాల గురించిన వార్తలు రిపోర్టు అవుతున్నాయి. గ్రహాంతర నివాసాల మీద బిలియనీర్లు పెట్టుబడులు పెడుతుండటమే అంతరిక్షం దిశగా పెద్ద మార్పు మొదలవుతోందనటానికి, అసాధ్యం సుసాధ్యమవుతోందనటానికి బండ గుర్తు! ఇదేరీతిలో దూర నక్షత్ర కాంతుల సాగే మంచి రాజకీయాన్ని కూడా మనం సాకారం చేసుకోగలం. సాంకేతిక పరిజ్ఞానం అమలు చేసినంత తేలిగ్గా మానవాళి ఆలోచనను మార్చి వ్యవస్థను నిర్మించటం సాధ్యం కాకపోవచ్చు.. కానీ అసాధ్యం మాత్రం కాదు. ఇందుకు గణనీయమైన స్థాయిలో పరిస్థితులు.. ఉన్నకొద్దీ అనుకూలంగా మారుతున్నాయి. పాలకులు, ఇతర ప్రధాన పార్టీల నాయకులు కీలక సమయంలో గొప్ప అవకాశాల్ని జారవిడవటం వల్ల, కొన్ని అవరోధాలు తలెత్తుతున్నాయి. అయినా కూడా స్థానికంగా ఎదగటానికి లోక్‌సత్తాకు అనుకూలమైన వాతావరణం నెలకొంటోంది.

ఏ రాజకీయ పార్టీ కూడా మెజారిటీ బడుగుజీవులు, మధ్యతరగతి ప్రజానీకం కోరుకున్న కనీస అవసరాలను అందించలేదు. వారికి చేరుకకాలేదు. వారిని ప్రలోభపెట్టి, రెచ్చగొట్టి, భయపెట్టి మాత్రమే తాత్కాలికంగా ఓట్లు దండుకుంటున్నాయి. విసిగిపోయిన ప్రజలు ఎవరినీ నమ్మడం లేదు. గతంలో యువత ఉపాధి, భద్రత కోసం విదేశాలకు వెళ్లే అవకాశాలు పుష్కలంగా ఉండేవి. ఇప్పుడు ఆ అవకాశాలు కూడా సన్నగిల్లిపోతున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. అందువల్ల దేశంలో ఉన్న సమస్యలను తప్పించుకునే కంటే, పరిష్కరించుకోవటం ద్వారానే యువత లబ్ధి పొందగలరు. వాస్తవాల్ని విశ్లేషించి మనకు కావలసిందేమిటి, వాటిని సాధించుకోవటానికి ఆచరణాత్మకమయిన పరిష్కారాలేంటి తెలుసుకునేందుకు, అందులో భాగమయ్యేందుకు రోజులో, వారాంతంలో కొద్దిసమయం కేటాయించాలి. ఇంజినీరింగ్ డిగ్రీ కాగితం సంపాదించి, ట్యాక్సీ డ్రైవర్లుగా, బస్ కండక్టర్లుగా, తాపీ మేస్త్రులుగా, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నవారు మన దేశంలో అనేకమంది ఉన్నారు. సొంతంగా తెలివితేటలుండి, పనిచేయాలనే ఆకాంక్ష ఉండి, వ్యవస్థ తప్పిదం వల్ల, నాయకుల మోసం వల్ల నష్టపోయిన ఇలాంటి వాళ్లంతా ఈ ఆలోచనకు ముందుకు రావాలి. ఇలాంటి యువతను లోక్‌సత్తా వారు సమీకరించి దిశానిర్దేశం చేయాలి. ఎన్నికల్లో తప్పక ఓటు వేసేలా, ఆలోచనతో సరైన అభ్యర్థికి ఓటు వేసేలా చేయాలి. జేపీ చొరవతో స్వతంత్ర నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించటంతోపాటు, అధికారం ఢిల్లీలోనో, రాష్ట్ర రాజధానుల్లోనో కాకుండా ప్రజల్లోకి వికేంద్రీకృతం కావాల్సిన అవసరాన్ని తెలియజేయండి. స్థానిక ప్రభుత్వాలకు సాధికారతతో స్వయంపాలన వల్ల కలిగే లాభాలను వివరించండి.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే లోక్‌సత్తా ఒంటరిగా కాకుండా.. ఎజెండా ప్రాతిపదికన ప్రధాన పార్టీతోనైనా సరే పొత్తు పెట్టుకోవటం మేలు. అలాగే ఒక్క ఎంపీ సీటైనా పోటీ చేయాలి. 2014లో విజయవాడలో పోటీ చేయమని అడిగితే జేపీ అంగీకరించలేదు. ఇప్పుడు అందరూ కూర్చుని మంచీచెడు మాట్లాడుకుని ఒక నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. మనం ఎవరితో పొత్తులు పెట్టుకున్నప్పటికీ మన ఎజెండాకు, రాజకీయ సంస్కృతికి భంగం కలగకుండా మాత్రం జాగ్రత్తలు తీసుకోవాలి. ఎజెండాయే లోక్‌సత్తా పార్టీ ప్రధాన బలం. ఈ బలం ఉంటే, ఆపద్ధర్మంగా, రాజనీతిపరంగా చిన్న చిన్న విషయాల్లో రాజీపడినా నష్టమేమీ ఉండదు. మీ అందరిలో చేరి తిరిగి పనిచేయాలని ఆశగా ఉంది. కొత్త ఉత్సాహం కలుగుతోంది. అవకాశం కల్పిస్తే లభిస్తే తప్పకుండా వస్తాను. అన్ని పార్టీల్లోనూ మిత్రులు, సన్నిహితులు, ఆత్మీయులూ ఉన్నారు. అందర్నీ కలుసుకోవాలని మీతో పంచుకోవాలని ఆశగా ఉంది. ప్రయత్నిస్తాను. తెలుగు ప్రజానీకానికి, శ్రేయోభిలాషులకు, లోక్‌సత్తా పార్టీ, సంస్థ మిత్రులందరికీ ఉగాది శుభాకాంక్షలు. ✧

# డబ్బు ఎన్నికలను ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండాతో ఎదుర్కొంటాం



ఆంధ్రప్రదేశ్‌లో ధనరాజకీయానికి ప్రత్యామ్నాయంగా జనరాజకీయాన్ని తీసుకురావటమే లక్ష్యంగా లోక్‌సత్తా పార్టీ పనిచేస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనరాజకీయ ఎజెండాపై ప్రజల్ని చైతన్య పరిచేందుకు నిర్దిష్ట ఎజెండాను ప్రకటించి ప్రచారం చేస్తామన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన లోక్‌సత్తా పార్టీ ముసాయిదా మేనిఫెస్టోని విడుదల చేశారు. ఇందులో అవినీతి నిర్మూలన, అధ్వాన్నంగా తయారైన విద్యాప్రమాణాలను, వైద్య వ్యవస్థను ప్రక్షాళన చేయటం, స్థానిక పాలనను బలోపేతం చేయటం, ప్రాంతీయ అసమానతల్ని సరిదిద్దటం, వ్యవసాయాన్ని లాభసాటి చేయటం, చట్టం ముందు అందరినీ సమానుల్ని చేసే చర్యల్ని చేపట్టటం, యువతకు ఉపాధి కల్పించే పారిశ్రామిక విధానం వంటి అంశాలున్నాయి. సూచనలు, సలహాలను క్రోడీకరించి తుది మేనిఫెస్టోను ఫిబ్రవరి మూడవ వారంలో విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నుపాటి వజీర్, ఉపాధ్యక్షుడు నర్రా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'మా ఓటు అమ్మకానికి లేదు'.. ధన ప్రవాహం తగ్గకపోతే ప్రజాస్వామ్యానికే ముప్పు


ఎన్నికల్లో డబ్బు ప్రవాహం తగ్గకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్ కృష్ణంరాజు అన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మా ఓటు అమ్మకానికి లేదు' ప్రచార బ్రోచర్ల ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ, 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలిచినవారిలో 30 శాతం మంది కోటీశ్వరులు కాగా, 2014లో వారి సంఖ్య 82 శాతానికి పెరిగిందన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అంచనా ప్రకారం, ఆయా పార్టీలు లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో రూ.35,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశాయని, 2009 ఎన్నికలతో పోలిస్తే ఇది 20,000 కోట్ల రూపాయలు ఎక్కువని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ అనధికార వ్యయం రూ.50,000 కోట్లు దాటే అవకాశం ఉందన్నారు. ప్రపంచంలో మరే దేశంలోనూ ఓట్లు కొనుగోలు చేయరని, ఇంత పెద్ద మొత్తంలోనూ ఎన్నికల్లో డబ్బు, అది కూడా అనధికార డబ్బు ఖర్చు పెట్టరని అన్నారు. అత్యంత ఖరీదైనవిగా చెప్పుకునే అమెరికా ఎన్నికలు కూడా మన ముందు బలాదూర్‌లా మారాయన్నారు. ధనప్రవాహం కారణంగా చట్టసభల్లోకి మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ప్రవేశించలేకపోతున్నారని, దీనివల్ల దేశం తీవ్రంగా నష్టపోతోందని అన్నారు. బెటర్ ఆంధ్రప్రదేశ్ (బాప్) కన్వీనర్ డీఎన్‌ఎన్‌వీ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ, ప్రస్తుత చట్టసభల్లో 30 శాతం మంది ప్రజా ప్రతినిధులపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఇంతమంది క్రిమినల్ ప్రజాప్రతినిధులు ఏ దేశ చట్టసభలోనూ కన్పించరన్నారు. ఎన్నికల్లో ధన ప్రవాహం, ఓటర్లను డబ్బుతో ప్రలోభపెట్టటం వంటి అనైతిక చర్యల నివారణకు రాష్ట్రవ్యాప్తంగా ఎడిటర్స్ అసోసియేషన్, బాప్ ఆధ్వర్యంలో ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'మా ఓటు అమ్మకానికి లేదు' అనే నినాదంతో ఉన్న ప్రచార పోస్టర్లను అన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తామన్నారు. లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షుడు అశోక్ కుమార్, సైకం భాస్కరరావు, డాక్టర్ దుగ్గరాజు శ్రీనివాస్, పి.సుబ్బారావు, తుర్లపాటి నాగభూషణం, చేకూరి సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల పట్ల గౌరవం తగ్గటం ప్రజారోగ్యానికి మంచిది కాదు

సమాజంలో వైద్యవృత్తికి ఎనలేని గౌరవం ఉందని, కానీ ప్రభుత్వాల విధానాల వల్ల ఆ గౌరవం తగ్గుతోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ఈ పరిణామం ప్రజారోగ్యానికి పెద్ద నష్టం చేస్తుందన్నారు.

నెల్లూరులోని సర్వజన ఆస్పత్రిని సురాజ్య యాత్రలో సందర్శించిన అనంతరం వైద్య విద్యార్థులనుద్దేశించి జయప్రకాష్ నారాయణ్ మాట్లాడారు. వైద్యరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, వైద్యసేవల మీద ప్రభావం చూపుతున్న రాజకీయ, పాలనాంశాలు గురించి చర్చించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆలోచింప చేసే జవాబులిచ్చారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎంబీబీఎస్ సీటు సంపాదించుకోవటం, పీజీ చేయటం ఓ పెద్దసవాలుగా మారిందని జేపీ అన్నారు. కానీ అంతిమంగా ఇది అంకితభావంతో, సేవా దృక్పథంతో పనిచేయాల్సిన వృత్తి అన్నారు. రోజుకు 3,500మంది ఐదేళ్లలోపు పిల్లలు నివారించ దగ్గ బాధలతో దేశంలో చనిపోతున్నారని, వైద్యఖర్చులకు జడిసి పలువురు ఆస్పత్రులకు కూడా రాకుండా పంటి బిగువున బతుకుబండిని లాగుతున్నారని, తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినవారిలో కోట్లమంది వైద్యసేవల కోసం ఆస్తులమ్మి పేదలుగా మారిపోతున్నారని అన్నారు. వైద్యులు సొంత ప్రయోజనాలకే పరిమితం కాకుండా జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తేనే ఈ పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. ఆధునిక వైద్యవిధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలని, పుస్తకాలకే పరిమితం





కాకుండా క్షేత్రస్థాయిలో రోగులకు వైద్యసేవలను అందించటంపై అవగాహన పెంచు కుంటుండాలని అన్నారు. ఖర్చు లేకుండా రోగిని పరీక్షించి చెప్పగల సామర్థ్యాన్ని వైద్యులు సంతరించుకోవాలన్నారు. ఎన్నికల రాజకీయాలను కాకపోయినా, సామాజిక రాజకీయాలను పట్టించుకోవాలన్నారు.

వైద్యరంగంలో ప్రజలకు భారం లేకుండా నాణ్యమైన సేవల్ని అందించటం, వైద్యుడు–రోగికి మధ్య విశ్వసనీయత పెంపొందించటం తదితర అంశాల మీద నిర్దిష్ట విధానాలను రూపొందించి సాధించేందుకు కృషిచేస్తున్నామని, సురాజ్య యాత్ర లక్ష్యాల్లో అందరికీ ఆరోగ్యం కీలకమైనదని, యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లో నమోదై వైద్యవిద్యార్థులు తమ అభిప్రాయాలను, సూచనలను తెలియచేయాలని జేపీ కోరారు.

కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, డాక్టర్ శ్రీధర్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, మాల్యాద్రి, లోక్‌సత్తా నేతలు రామ్మోహనరావు, బాలసుబ్రహ్మణ్యం, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ✧




# రొమాంటీకరణను దాటి చూడగలిగితేనే మార్పు !

"అందరూ విజ్ఞులూ, నీతివంతులు, దూరదృష్టి గలవారు అని భ్రమపడి ప్రజాస్వామ్యాన్ని రొమాంటీకరించొద్దు".... వ్యాపార రాజకీయాలను అభివృద్ధి రాజకీయాల వైపు మళ్లించే విధానాలపై గుర్‌గావ్‌లో సీసీఎస్ ఇండియా నిర్వహించిన సదస్సులో యువ ఆలోచనాపరులనుద్దేశించి మాట్లాడుతున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 22-02-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on February16th 2019

# RESERVATION

**MOVEMENTS GOING ACROSS THE COUNTRY NEED A CREATIVE RESPONSE. GIVING QUOTAS TO OC'S MAY NOT WORK.**

## THREE STEPS MAY HELP:

1. Exclude creamy layer from reservations
2. Add some marks to kids going to govt or low-end Pvt. Schools.
3. Improve school outcomes to guarantee learning levels after 12 yrs of schooling irrespective of parental income & caste



*Dr.Jayaprakash Narayan, Former IAS,*
*Founder,NGO Loksatta Movement*



|| SHARE IT WIDELY ||

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad